ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888
Published From Nandyal : Cerculated in Nandyal,Kurnol,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts
సంపుటి - 01 సంచిక -286 పేజీలు - 08 వెల - 06/- శనివారం 18 జనవరి 2025

# సీఐడీ మాజీ చీఫ్ సునీల్ కుమార్ పై విచారణకు ఉత్తర్వులు

- గత ప్రభుత్వ హయాంలో సీఐడీ చీఫ్ గా వ్యవహరించిన సునీల్ కుమార్
- సునీల్ కుమార్ పై అనేక ఆరోపణలు
- ఇద్దరు అధికారులతో విచారణ అథారిటీ ఏర్పాటు చేసిన సర్కారు

**జనవరి 17 (రిపబ్లిక్ న్యూస్):** గత ప్రభుత్వ హయాంలో సీఐడీ చీఫ్ గా వ్యవహరించిన సునీల్ కుమార్ అధికార దుర్వినియోగానికి పాల్పడినట్టు అనేక ఆరోపణలు ఉన్నాయి. తాజాగా, సునీల్ కుమార్ పై విచారణకు ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సునీల్ కుమార్ పై ఉన్న ఆరోపణల విచారణ కోసం ప్రత్యేకంగా విచారణ అథారిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ అథారిటీలో ఇద్దరు విచారణ అధికారులను నియమించారు. రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా, విజిలెన్స్ డీజీ హరీశ్ కుమార్ గుప్తా ఈ అథారిటీలో విచారణ అధికారులుగా వ్యవహరిస్తారు. సునీల్ కుమార్ పై విచారణ పూర్తి చేసి సాధ్యమైనంత త్వరగా నివేదిక అందించాలని ప్రభుత్వం ఆదేశించింది.





# నిషేధితభూముల అధ్యయనానికి సబ్ కమిటీ

**అమరావతి,జనవరి 17 (రిపబ్లిక్ న్యూస్):** నిషేధిత జాబితా నుంచి అక్రమంగా తొలగించిన భూములపై నిర్ణయం తీసుకునేందుకు మంత్రి వర్గ ఉపసంఘం ఏర్పాటుకు ఎపి కేబినెట్ నిర్ణయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం సచివాలయంలో కేబినెట్ సమావేశం జరిగింది. వైకాపా హయాంలో దాదాపు 7 లక్షల ఎకరాల భూములు నిషేధిత జాబితా నుంచి తొలగించారు. దీనిపై అధ్యయనం చేసి ఆయా భూములను ఏం చేయాలన్న దానిపై మంత్రుల కమిటీ ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది. వచ్చే కేబినెట్ భేటీలోపు భూముల అవకతవకలపై నివేదిక ఇవ్వాలని ఆయా జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులను సీఎం ఆదేశించారు

మిగతాది 2లో...

- నిషేధిత జాబితా నుంచి 7లక్షల ఎకరాల భూముల తొలగింపు
- అధ్యయనానికి కేబినేట్ సబ్ కమిటీ ఏర్పాటు
- ధాన్యం కొనుగోలు కోసం 700 కోట్ల రూపాయలకు గ్యారెంటీ
- 62 నియోజకవర్గాల్లో అన్న క్యాంటీన్ల ఏర్పాటు
- ఫెర్రో అల్లాయ్స్ పరిశ్రమలకు ఎలక్ట్రిసిటీ డ్యూటీ టారిఫ్ తగ్గింపు
- పోలవరం డయాఫ్రామ్ వాల్ నిర్మాణానికి ఆమోదం
- అమరావతి పనులకు వేగంగా నిర్ణయాలు
- విశాఖ స్టీల్‌కు ఆర్థిక ప్యాకేజీతో కేంద్రానికి కృతజ్ఞతలు
- ఎపి కేబినేట్‌లో పలు కీలక నిర్ణయాలు

# ఏపీలో టిప్పర్‌ను ఢీకొన్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు.. నలుగురి మృతి




2లో

చిత్తూరు జిల్లా శివారు గంగాసాగరం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
ఆగి ఉన్న టిప్పర్‌ను ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొట్టడంతో ప్రమాదం
గాయపడిన 13 మంది క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించిన పోలీసులు

# విశాఖపట్నం ఉక్కు కి ఆంధ్రప్రదేశ్ ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం

- ఉక్కు రంగానికి ఉన్న ప్రాముఖ్యతను అర్థం చేసుకున్నామన్న మోదీ
- విశాఖ ఉక్కు పరిశ్రమపై కేంద్రం కరుణ
- రూ.11.440 కోట్లతో భారీ ప్యాకేజి ప్రకటన
- ప్రధాని మోదీకి, కేంద్రానికి ధన్యవాదాలు తెలుపుతున్న కూటమి నేతలు



**జనవరి 17 (రిపబ్లిక్ న్యూస్):** విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ అంటూ జరుగుతున్న ప్రచారానికి తెర దించుతూ కేంద్ర ప్రభుత్వం రూ.11,440 కోట్లతో భారీ ప్యాకేజి ప్రకటించిన సంగతి తెలిసిందే. దాంతో కూటమి నేతలు ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నారు. దీనిపై ప్రధాని మోదీ స్పందించారు. విశాఖపట్నం ఉక్కు కర్మాగారానికి ఏపీ ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం ఉందని తెలిపారు. నిన్నటి కేంద్ర క్యాబినెట్ సమావేశంలో, విశాఖ ఉక్కు పరిశ్రమకు రూ.10 వేల కోట్లకు పైగా పెట్టుబడిని మద్దతుగా అందించాలని నిర్ణయించామని మోదీ వెల్లడించారు. ఆత్మ నిర్భర భారత్ ను సాధించడంలో ఉక్కు రంగానికి ఉన్న ప్రాముఖ్యతను అర్థం చేసుకుని ఈ చర్య చేపట్టామని వివరించారు. ఈ మేరకు ప్రధాని మోదీ ట్వీట్ చేశారు.

# ఎంతమంది ఉన్నా తల్లికి వందనం అని మోసం చేస్తావు

జనాభా పెరుగుదలపై బాబు వ్యాఖ్యలు
పిల్లల్ని కనాలనడంపై మండిపడ్డ అంబటి



**అమరావతి,జనవరి 17 (రిపబ్లిక్ న్యూస్):** ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో జనాభా పెరగాల్సిన అవసరం చాలా ఉందని.. ఇప్పుడు కనీసం ఇద్దరు పిల్లలను కనాలంటూ ఏపీ సీఎం చంద్రబాబు పదే పదే చెబుతుండటంపై మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంతమంది ఉన్నా అందరికీ తల్లికి వందనం అని మోసం చేశావని విమర్శించారు. మిగతాది 2లో...



# దేశంలో ఎలక్ట్రిక్ మొబిలిటీ విస్తరణకు చర్యలు

జీవ ఇంధనాల అభివృద్ధిపై భారతదేశం దృష్టి
భారత్ మొబిలిటీ ఎక్స్ పో 2025'
ప్రారంభోత్సవంలో ప్రధాని మోదీ 2లో

# పెట్టుబడులు లక్ష్యంగా చంద్రబాబు దావోస్ పర్యటన

## సిఎంతో పాటు పలువురు మంత్రులు, అధికారులు



**అమరావతి,జనవరి 17 (రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్రానికి పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా దావోస్‌లో జరిగే ప్రపంచదేశాల ఆర్థిక సదస్సులో సిఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ పాల్గొనబోతున్నారు. ఐదు సెషన్లలో ప్రధానవక్తగా మాట్లాడేందుకు రాష్ట్రం తరఫున అవకాశం దక్కింది. వాటిలో సీఎం చంద్రబాబు మూడు సెషన్లు.. మంత్రి లోకేశ్ రెండు సెషన్లలో మాట్లాడనున్నారు. అందుకు అనుగుణంగా వారి పేర్లతో 'వైట్‌పాస్'లు డబ్ల్యూఈఎఫ్ నుంచి అందాయి. ఆహ్వానితులకే సమావేశాల్లో పాల్గొనడానికి, మాట్లాడడానికి అవకాశం ఉంటుంది. ఈ సమావేశాల్లో పాల్గొనేందుకు సీఎం చంద్రబాబు శనివారం రాత్రి బయలుదేరి వెళ్లనున్నారు. ఈ నెల 20 నుంచి ఐదురోజుల పాటు దావోస్‌లో జరిగే సమావేశాల్లో ఆయన పాల్గొంటారు. మిగతాది 2లో...

# ఉద్యోగుల పనితీరుపై నిఘా ఉండాల్సిందే

అత్యుత్తమ పనితీరుకు ఇది దోహద పడుతుంది
డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ అభిప్రాయం



**అమరావతి,జనవరి 17 (రిపబ్లిక్ న్యూస్):** ఉద్యోగుల పనితీరుపై సున్నితమైన విజిలెన్స్ ఉండాలని.. వారు అప్రమత్తంగా, అత్యుత్తమంగా పని చేయడానికి ఇది ఉపయోగపడుతుందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఉద్యోగుల నిజాయతీ, పనితీరు, నిబద్ధతకు అది ఓ సూక్ష్మదర్శినిలా పని చేస్తుందన్నారు. ఉద్యోగులపై నమోదవుతున్న విజిలెన్స్ కేసులు, శాఖాపరమైన విచారణలు, దర్యాప్తులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండిపోవడం వల్ల ఉద్యోగుల పనితీరుపై ప్రభావం చూపిస్తుందన్నారు. కొన్ని కేసులు 20 ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్నాయని.. ఇలా అపరిష్కృతంగా ఉండటం వల్ల ఉద్యోగ విరమణ తర్వాత ఉద్యోగులు రిటైర్మెంట్ బెనిఫిట్స్ పొందలేకపోతున్నారనే విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. మిగతాది 2లో...

# ఏపీలో టిప్పర్‌ను ఢీకొన్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు .. నలుగురి మృతి

**చిత్తూరుజనవరి 17 (రిపబ్లిక్ న్యూస్):**
చిత్తూరు జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందగా, మరో 13 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన శుక్రవారం వేకువజామున చిత్తూరు శివారు గంగాసాగరం వద్ద జరిగింది. తిరుపతి నుంచి మధురై వెళుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి ఆగి ఉన్న టిప్పర్‌ను ఢీకొట్టింది. అనంతరం 20 అడుగులు జారుకుంటూ వెళ్లి రోడ్డు నిర్మాణం జరుగుతున్న ప్రదేశంలోని కరెంటు స్తంభాన్ని బస్సు ఢీకొట్టింది. దీంతో కరెంటు స్తంభం బస్సులోకి చొచ్చుకుని రావడంతో నలుగురు ప్రయాణికులు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదంలో మరో 13 మంది గాయపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను వేలూరు, నరివి ఆసుపత్రులకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కలెక్టర్ ఆదేశించారు.

# పెట్టుబడులు లక్ష్యంగా

## చంద్రబాబు దావోస్ పర్యటన

**(మొదటి పేజి తరువాయి)**
ఈ వేదిక ద్వారా రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను కంపెనీల ప్రతినిధులకు సీఎం వివరించనున్నారు. క్లీన్ ఎనర్జీ, ఫుడ్ ప్రాసెసింగ్‌తో పాటు.. ఐటీ, పలు కీలకరంగాల్లో పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షించేందుకు దావోస్‌ను వేదికగా చేసుకోవాలన్నది ప్రభుత్వ ఆలోచన. ఇటీవల రాష్ట్రానికి వచ్చిన భారీ ప్రాజెక్టుల గురించి వివరించడం ద్వారా ప్రపంచ దృష్టిని ఆకర్షించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ సదస్సులో పాల్గొనడం ద్వారా రాష్ట్రానికి గరిష్ఠ పెట్టుబడుల ప్రయోజనాన్ని సాధించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. రాష్ట్రంలో పెట్టుబడులకున్న అవకాశాలను ప్రపంచ దేశాలకు వివరించేలా ప్రత్యేకంగా రాష్ట్ర పెవిలియన్‌ను ఏర్పాటుచేశారు. అందులో ఒకేసారి నాలుగు రౌండ్‌టేబుల్ సమావేశాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. వివిధ కార్యక్రమాల్లో సీఎం బిజీగా గడిపితే.. వీలైనన్ని రౌండ్‌టేబుల్ సమావేశాలను నిర్వహించే బాధ్యతలను అధికారులు, ఇతర ప్రతినిధులకు అప్పగించారు. ద్వైపాక్షిక సమావేశాల్లో 18 దేశాలకు చెందిన కంపెనీల సీఈవోలు, ప్రతినిధులతో సమావేశం కానున్నారు. సీఐఐ నిర్వహించే బ్రేక్‌ఫాస్ట్ సెషన్‌లో సీఎం, మంత్రులు, అధికారులు పాల్గొంటారు. రాష్ట్రప్రభు త్వం కూడా వివిధ దిగ్గజ కంపెనీల సీఈవోలతో సమావేశం ఏర్పాటుచేస్తోంది. రాష్ట్రం ఏర్పాటుచేసే పెవిలియన్‌ను సందర్శించాలని సదస్సుకు హాజరయ్యే వివిధ దేశాల ప్రభుత్వాలకు రాష్ట్ర ప్రభుత్వం లేఖలు రాసింది. దావోస్ వెళ్లే బృందంలో సీఎంతో పాటు మరో ఎనిమిది మందికి అవకాశం లభించింది. ప్రభుత్వ అధికారులు, మంత్రులు మాత్రమే బృందంలో సభ్యులుగా ఉండాలని కేంద్రం నుంచి ఆదేశాలు అందాయి. ఈ ప్రకారం మంత్రులు లోకేశ్, టీజీ భరత్, సీనియర్ అధికారులు కార్తికేయ మిశ్రా, పియూష్‌కుమార్, యువరాజ్, సీఎం ముఖ్య భద్రత అధికారి శ్రీకాంత్, ఈడీబీ సీఈవో సాయికాంత్ వర్మ, కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ పీడీ వికాస్ మర్మత్ ఈ బృందంలో ఉండేందుకు కేంద్రం నుంచి అనుమతులు వచ్చాయి. అధికారులు, మంత్రులకు సహాయకులుగా మరో 15మంది దావోస్ వెళ్లనున్నారు.రాష్ట్రంలో ఇటీవల ప్రకటించిన పారిశ్రామిక పాలసీలో ప్రత్యేకతలు వంటి అంశాలను వివరించడం ద్వారా పెట్టుబడిదారుల దృష్టి ఆకర్షించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

# నేడు మైదుకూరులో చంద్రబాబు పర్యటన

**'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్'ను ప్రారంభించనున్న సిఎం**

**మైదుకూరులోనే ఎన్టీఆర్ వర్ధంతి సభ నిర్వహణ**



**అమరావతి,జనవరి 17 (రిపబ్లిక్ న్యూస్):** మైదుకూరులో ఏపీ సిఎం చంద్రబాబు శనివారం పర్యటించనున్నారు. శనివారం కడప జిల్లా పర్యటనలో భాగంగా మైదుకూరులో శనివారం 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్'ను సీఎం చంద్రబాబు ప్రారంభించనున్నారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులతో ఆయన మాట్లాడనున్నారు. ఇక ఎన్టీఆర్ వర్ధంతిని కూడా మైదుకూరులోనే సీఎం చంద్రబాబు నిర్వహించనున్నారు. శనివారం ఉదయం 10:30కి ఉండవల్లి నివాసం నుంచి ఉ.11:05 గంటలకు విజయవాడ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. విజయవాడ ఎయిర్‌పోర్టు నుంచి ఉ.11:50 నిమిషాలకు కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. మధ్యాహ్నం 12 గంటలకు కడప విమానాశ్రయం నుంచి మ. 12:10 నిమిషాలకు మైదుకూరులో ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం 12 గంటల 20 నిమిషాలకు కెవిస్సీ కళ్యాణ మండపానికి చేరుకుని ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 1:50 నిమిషాలకు ప్రెస్ మీట్ నిర్వహిస్తారు. కేవిస్సీ కళ్యాణ మండపం నుంచి రోడ్డు మార్గం ద్వారా బయలుదేరి వినాయక నగర్‌లోని మున్సిపల్ కార్మికుని ఇంటిని సందర్శించి చెత్త సేకరణ గురించి వివరిస్తారు. మధ్యాహ్నం 2:15 నిమిషాలకు అక్కడ నుంచి బయలుదేరి నేషనల్ గ్రీన్ కాప్స్‌తో కలిసి నడుస్తూ రాయల కూడలి ద్వారా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణానికి చేరుకుంటారు. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శిస్తారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రజా వేదికలో స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమంలో పాల్గొని ప్రారంభిస్తారు. సాయంత్రం 4: 30 నిమిషాలకు హెలిపాడ్ ప్రాంగణానికి చేరుకుని 4:40 నిమిషాలకు కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. సాయంత్రం 4: 50 నిమిషాలకు కడప ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి సాయంత్రం 5:35లకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. అనంతరం అమరావతిలోని నివాస గృహానికి 6 గంటల 15 నిమిషాలకు సీఎం చంద్రబాబు చేరుకుంటారు.

# ఉద్యోగుల పనితీరుపై నిఘా ఉండాల్సిందే

**(మొదటి పేజి తరువాయి)**
ఈ నేపథ్యంలో క్రమశిక్షణ చర్యలు, శాఖాపరమైన విచారణలకు సంబంధించిన విచారణలు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండటంపై పవన్ కల్యాణ్ దృష్టి సారించారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్.డబ్ల్యూ.ఎస్., అటవీ, పర్యావరణ శాఖల్లో ఉన్న శాఖాపరమైన కేసుల వివరాలు, అవి ఎంతకాలంగా పెండింగ్‌లో ఉన్నాయనే అంశంపై ఆరా తీశారు. అందుకు గల కారణాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని సంబంధిత శాఖల ముఖ్య కార్యదర్శులను డిప్యూటీ సీఎం ఆదేశించారు. నివేదికను మూడు వారాల్లోగా ఇవ్వాలని ఆదేశించారు. అయితే, అభియోగాలు వచ్చిన వారిపై విచారణ ప్రారంభించినపుడు దానికి తగిన పత్రాలు అందుబాటులో ఉండటం లేదని, ఇది విచారణలో జాప్యానికి కారణం అవుతోందని అధికారులు పవన్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై డిప్యూటీ సీఎం స్పందిస్తూ.. తన శాఖల పరిధిలో విజిలెన్స్ రిపోర్టుల ఆధారంగా తీసుకునే చర్యల్లో వేగం పెంచేందుకు ప్రత్యేక మార్గదర్శకాలు సూచించారు. ఏదైనా విషయంలో అధికారులు, సిబ్బందిపై ఆరోపణలు వస్తే ప్రాథమిక విచారణ పకడ్బందీగా జరపాలన్నారు. ప్రాథమిక విచారణలోనే బలమైన ఆధారాలు సేకరించాలన్నారు. విచారణ అధికారి, ఆరోపణలు వచ్చిన ఉద్యోగికి మధ్య ఎలాంటి సన్నిహిత సంబంధాలు లేకుండా తొలి దశలోనే నిరోధించాలని స్పష్టం చేశారు. అన్ని విజిలెన్స్, నాన్ విజిలెన్స్ కేసులను సరైన, సక్రమమైన పద్ధతిలో తిరిగి విచారించి వేగంగా వాటిని పరిష్కరించేందుకు ఆయా శాఖల అధిపతులు దృష్టి సారించాలన్నారు.

# నిషేధితభూముల అధ్యయనానికి సబ్‌కమిటీ

**(మొదటి పేజి తరువాయి)**
రాష్ట్రంలోని సత్యసాయి, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో నిషేధిత జాబితా నుంచి భారీగా భూములు తొలగించినట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. అలాగే కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. ధాన్యం కొనుగోలు కోసం 700 కోట్ల రూపాయల రుణం తీసుకునేందుకు ఏపీ మార్క్‌ఫెడ్‌కు ప్రభుత్వ హామీ ప్రతిపాదనపై అనుమతి ఇచ్చింది. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగవ్యవస్థపై చర్చించనుంది. ఇక, 62 నియోజకవర్గాల్లో అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు సంబంధించి నిర్ణయం తీసుకుంది. మరోవైపు.. ఫెర్రో అల్లాయ్స్ పరిశ్రమలకు ఎలక్ట్రిసిటీ డ్యూటీ టారిఫ్ తగ్గింపు ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది. నాగావళి నదిపై గౌతు లచ్చన్న తోటపల్లి బ్యారేజ్ పై కుడి, ఎడమ వైపు మిని హైడల్ ప్రాజెక్టుల నిర్మాణం ప్రతిపాదనకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కడప జిల్లా సీకే దిన్నె మండలంలో ఏపీ ఇండస్ట్రియల్ కారిడార్ ఇన్ఫ్రా కార్పొరేషన్ కు కేటాయించిన 2,595 ఎకరాల బదిలీకి స్టాంపు డ్యూటీ మినహాయింపు ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే ప్రభుత్వ పథకాల అమలు, పోలవరం ప్రాజెక్టు, అమరావతి నిర్మాణ పనులు, పేదలకు భూమి పంపిణీ వంటి అంశాలపై ప్రధానంగా చర్చించారు. తల్లికి వందనం పథకం అమలు విషయంపై చర్చించారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి తల్లికి వందనం ఇవ్వాలని కేబినెట్ నిర్ణయించింది. అలాగే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ పథకం డబ్బులు వేసిన వెంటనే.. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్నదాత సుఖీభవ వేయాలని నిర్ణయించారు. ఇక పోలవరం డయాఫ్రామ్ వాల్‌ను వెంటనే ప్రారంభించాలని నిర్ణయించారు. రాధాజాని అమరావతి పనులు కూడా వెంటనే ప్రారంభమవుతానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ కేబినెట్ భేటీలో చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు స్థలం పేదలకు ఇచ్చేందుకు వెంటనే ఏర్పాట్లు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. బడ్జెట్ సమావేశాలకు ముందు కలెక్టర్లు సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఇళ్ల స్థలాలకు పట్టణాల్లో స్థలం లేకపోతే ఇల్లు ఇవ్వాలని నిర్ణయించారు. ఇన్‌చార్జి మంత్రులు జిల్లాలో సమావేశం ఏర్పాటు చేసి స్థలాలు సేకరణపై నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. అమరావతి, పోలవరం, వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు నిధులు ఇవ్వడంపై కేంద్రానికి కృతజ్ఞతలు తెలిపింది. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు నిధులు ఇచ్చినా భవిష్యత్‌లో స్టీల్ ప్లాంట్ కొనసాగే విధంగా చర్యలు చేపట్టాలని కేబినెట్ భావించింది. విశాఖ ఉక్కు, ఆంధ్రుల హక్కు అనే సెంటిమెంట్ ఉందని, అందుకు అనుగుణంగా ప్లాంట్‌ను నడపాలని కేబినెట్ భావించింది. ఫ్రీ హోల్డ్‌లో ఉన్న 15 లక్షల 35 వేల ఎకరాల్లో 25 వేల ఎకరాలు రిజిస్ట్రేషన్ అయిందని మంత్రి మనోహర్ చెప్పారు. రాష్ట్రానికి కేంద్రం ఎంతో సహాయం చేస్తుందని అందువలన.. మనం కూడా కేంద్రానికి అదేవిధంగా సహాయం చేయాల్సిన అవసరం ఉందని సీఎం చెప్పారు. శనివారం సాయంత్రం కేంద్ర హోంమంత్రి అమిత్ షా వస్తున్నారని, ఆయనతో డిన్నర్ మీట్‌లో మూడు పార్టీల నేతలు కలుస్తారని సీఎం చెప్పారు. ఇకపోతే పలు నిరణయాల్లో..గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల హేతుబద్ధీకరణకు ఆమోదం దక్కింది. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆర్‌టీజీఎస్ ఏర్పాటుకు ఆమోదం ఇచ్చింది. తోటపల్లి బ్యారేజీపై మినీ హైడల్ ప్రాజెక్టుల నిర్మాణాలకు ఆమోదం ఇచ్చారు. కడప జిల్లా సీకేదిన్నెలో 2,595 ఎకరాల బదిలీకి స్టాంప్ డ్యూటీ మినహాయింపుకు ఆమోదం అభించింది. అభ్యంతరం లేని ఆక్రమిత స్థలాల క్రమబద్ధీకరణ ప్రతిపాదనలకు ఆమోదం ఇచ్చారు. ఫెర్రో అల్లాయ్స్ పరిశ్రమలకు విద్యుత్ టారిఫ్ తగ్గింపు ప్రతిపాదనపై కేబినెట్ ఆమోదం. విద్యుత్ సుంకంలో టారిఫ్‌ల తగ్గింపును మార్చి వరకు పొడిగిస్తూ ఆమోదం ఇచ్చారు. 62 నియోజకవర్గాల్లో 63 అన్న క్యాంటీన్ల ప్రారంభానికి ఆమోదం ఇచ్చారు. వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26) ప్రారంభంలోనే పలు పథకాలకు శ్రీకారం చుట్టనున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. కేబినెట్ భేటీ అనంతరం పలు రాజకీయ అంశాలపై చంద్రబాబు చర్చించారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మత్స్యకార భరోసా పథకాల అమలుకు సిద్ధం కావాలని అధికారులను ఆదేశించారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు చొప్పున ఇచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టు డయాఫ్రం వాల్ నిర్మాణం, రాజధాని అమరావతిలో నిర్మాణ పనులు వెంటనే ప్రారంభమవుతాయని సీఎం వెల్లడించారు.

# విశాఖ ఉక్కు హామీని నిలబెట్టుకున్న కేంద్రం

**ప్లాంట్ పునరుద్దరణకు రూ.11,440 కోట్ల ప్యాకేజీ - మీడియా సమావేశంలో వెల్లడించిన కేంద్రమంత్రులు**



**న్యూఢిల్లీ,జనవరి 17 (రిపబ్లిక్ న్యూస్):**
విశాఖ ఉక్కు పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టు కుందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం రూ.11,440 కోట్ల ప్యాకేజీ ప్రకటించిన విషయాన్ని కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి, మరో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మతో కలిసి రామ్మోహన్ నాయుడు మీడియాతో మాట్లాడారు. ప్యాకేజీ ప్రకటించిన ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి ఏపీ ప్రజల తరఫున ధన్యావాదాలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా నెలకొన్న స్టీల్ ప్లాంట్ సమస్యల పరిష్కారానికి అడుగులు పడ్డాయని పేర్కొన్నారు. విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు నినాదాన్ని కేంద్రం కాపాడిందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర ప్యాకేజీపై రామ్మోహన్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు. నష్టాలను అధిగమించేందుకు, ప్లాంట్ పూర్తి ఉత్పాదనతో లాభాల బాట పట్టేందుకు కేంద్ర ప్యాకేజీ దోహద పడుతుందన్నారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజల ఆకాంక్షల పట్ల కేంద్ర ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమన్నారు. ఇకపోతే ప్రైవేటీకరన అంటూ సాగిన ప్రచారానికి తెరపడింది. విశాఖ ఉక్కుకు కేంద్ర ప్రభుత్వం కొత్త ఊపిరులూదింది. తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న కర్మాగారాన్ని పునరుజ్జీవింపజేయడానికి ముందుకొచ్చింది. ఇందుకోసం రూ.11,440 కోట్ల ప్యాకేజీని ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ శుక్రవారం అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఈ ప్యాకేజీకి గురువారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశం ఆమోదముద్ర వేసినట్లు కేంద్ర మంత్రి పేర్కొన్నారు. 'ఇది భారీ రివైవల్ ప్యాకేజీ. స్టీల్ రంగంలో విశాఖ ఉక్కు ప్రధానమైన సంస్థ. విశాఖ ఉక్కు..పోర్టు ఆధారిత స్టీల్ ప్లాంట్. ఈ పరిశ్రమను ఏళ్ల తరబడి సమస్యలు వేధిస్తున్నాయి. విశాఖ ఉక్కుకు ప్రకటించిన ఆర్థిక ప్యాకేజీ తక్షణం అమల్లోకి వస్తుంది. త్వరలో రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లు ప్రారంభమవుతాయి ఆగస్టు నాటికి 3 బ్లాస్ట్ ఫర్నేస్‌లు అందుబాటులోకి వస్తాయి. ముడి సరకు సరఫరా కోసం ఎన్‌ఎండీసీతో చర్చిస్తున్నాం. ఆత్మనిర్భర్ భారత్‌లో విశాఖ ఉక్కు కీలక పాత్ర పోషిస్తుంది. దేశ ఉక్కు అవసరాలు తీర్చడంలో విశాఖ స్టీల్ ఎ÷-లాంట్‌ది కీలక పాత్ర. స్టీల్ ఎ÷-లాంట్ యాజమాన్యం, కార్మికులకు శు భాకాంక్షలు' అని అశ్వినీవైష్ణవ్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారం చేపట్టిన రోజు నుంచి విశాఖ ఉక్కుపై ప్రత్యేక దృష్టి సారించారు. దిల్లీ వెళ్లిన ప్రతిసారి ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామిలతో సమావేశమై కర్మాగారం పునరుజ్జీవంపై చర్చలు జరుపుతూ ఉన్నారు. ఇటీవల ప్రధానిని మరోమారు కలిసి విశాఖ ఉక్కుకు అవసరమైన ఆర్థిక సాయం అందించాలని కోరారు. దీనిపై విభిన్న కోణాల్లో చర్చించిన అనంతరం కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఈ ప్యాకేజీకి ఆమోదం తెలిపింది. ఏటా 7.3 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యమున్న విశాఖ ఉక్కు కర్మాగారం 2023-24లో రూ.4,848.86 కోట్లు, 2022-23లో రూ.2,858.74 కోట్ల నష్టాన్ని మూటగట్టుకొంది. వర్కింగ్ క్యాపిటల్ కోసం చేసిన అప్పులు పెరగడం దీనికి ప్రధాన కారణం. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి రావడంతో స్టీల్ ఎ÷-లాంట్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి ఎ÷-లాంటును సందర్శించారు. ఎ÷-లాంటు నిలదొక్కుకోవడానికి రూ.18 వేల కోట్లు అవసరమని విశాఖ ఎంపీ శ్రీభరత్, తెదేపా రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, కార్మిక సంఘాల నేతలు ఆయనకు విన్నవించారు. ఆ తర్వాత కొన్ని రోజులకే కేంద్ర ఉక్కుశాఖ ఎమర్జెన్సీ అడ్వాన్స్ ఫండ్ కింద.. జీఎస్టీ చెల్లింపులకు రూ.500 కోట్లు, ముడిసరకుకు సంబంధించి బ్యాంకు అప్పుల చెల్లింపులకు రూ.1,150 కోట్ల చొప్పున రెండు విడతల్లో సాయం చేసింది. వర్కింగ్ క్యాపిటల్ కోసం చేసిన అప్పుల భారం, తగినంత ముడిసరకు లేకపోవడం, కోర్టు ఎటాచ్‌మెంట్లు, ఇన్‌సాల్వెన్సీ ప్రొసీడింగ్స్‌తో విశాఖ ఉక్కు కర్మాగారం తీవ్ర ఇబ్బందుల్లో ఉంది. వీటిని తీర్చడంతోపాటు భవిష్యత్తులో తలెత్తే కష్టాల నుంచి తప్పించడానికి ఒక సమగ్ర ప్రణాళికను తయారు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ఇదివరకే పార్లమెంటు స్థాయీసంఘానికి చెప్పింది. దానిపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఆ సంఘం పార్లమెంటుకు సమర్పించిన నివేదికలో సిఫార్సు చేసింది. దాని ప్రకారమే కేంద్ర ప్రభుత్వం ఈ ప్యాకేజీకి ఆమోదముద్ర వేసినట్లు తెలుస్తోంది.

# ఎంతమంది ఉన్నా తల్లికి వందనం అని మోసం చేస్తావు

**(మొదటి పేజి తరువాయి)**ఇప్పుడేమో లెక్క లేకుండా పిల్లల్ని కనమంటున్నావ్.. సిగ్గుందా అంటూ మండిపడ్డారు. రాష్ట్రంలో జనాభాను పెంచేందుకు ప్రోత్సాహకాలు ఇస్తామని ఏపీ సీఎం చంద్రబాబు గురువారం ప్రకటించారు. ఒకప్పుడు జనాభా అంటే భారమని.. ఇప్పుడు ఆస్తి అని వివరించారు. అప్పట్లో జనాభాను నియంత్రించేందుకు ప్రోత్సాహకాలు ఇచ్చేవాళ్లమని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయని.. ఇప్పుడు జనాభా అవసరం ఉందని చెప్పారు. ఇప్పుడు కనీసం ఇద్దరు పిల్లలు ఉంటేనే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అర్హత కల్పిస్తామని స్పష్టం చేశారు. ఇకపై ఏ పథకం అమలు చేయాలన్నా కుటుంబ పరిమాణాన్ని ప్రమాణికంగా తీసుకుంటామని తెలిపారు. జనాభానే ఆస్తి. సంపద సృష్టిస్తున్నామంటూ జనాభాను మరిచిపోతే.. ఆ సంపద ఎవరికి ఇవ్వాలో తెలియదని చంద్రబాబు అన్నారు. భవిష్యత్తులో పెద్ద పెద్ద విమానాశ్రయాలు, విశాలమైన రహదారులు ఉంటాయి కానీ.. వాటిని వినియోగించుకునే మనుషులే ఉండరని వ్యాఖ్యానించారు. జనాభాను పెంచాలని చంద్రబాబు అనడం ఇదే మొదటి సారి కాదు.. తాజాగా అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జనాభాను పెంచాల్సిన అవసరం ఉందని చంద్రబాబు చెబుతూనే ఉన్నారు. అయితే దీనిపైనే అంబటి రాంబాబు స్పందించారు. తల్లికి వందనం పేరుతో మోసం చేసి.. ఇప్పుడెలా లెక్కలేకుండా పిల్లల్ని కనాలని చెబుతున్నావని మండిపడ్డారు.తల్లికి వందనం పథకం కింద బడికి వెళ్లే ప్రతి విద్యార్థికి ఏటా రూ.15వేల చొప్పున అందిస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. కానీ ఇప్పటివరకు ఆ పథకాన్ని అమలు చేయలేదు. అంతేకాకుండా ఈ పథకంలో కోత పెడుతూ ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉన్నప్పటికీ ఒక్కరికే ఈ పథకం వర్తింపజేస్తారని ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే అంబటి రాంబాబు విమర్శలు గుప్పించారు.

# దేశంలో ఎలక్ట్రిక్ మొబిలిటీ విస్తరణకు చర్యలు

**న్యూఢిల్లీ,జనవరి 17 (రిపబ్లిక్ న్యూస్):**
దేశంలో ఎలక్ట్రిక్ మొబిలిటీ విస్తరణకు ప్రభుత్వం విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. గ్రీన్ టెక్నాలజీ, ఈవీలు, హైడ్రోజన్ ఇంధనం, జీవ ఇంధనాల అభివృద్ధిపై భారతదేశం దృష్టిసారిస్తోందన్నారు. దిగ్గజ వ్యాపారవేత్తలు రతన్ టాటా, ఒసాము సుజుకీ భారతదేశ ఆటో రంగం వృద్ధికి.. మధ్యతరగతి ప్రజల కలను నెరవేర్చడానికి ఎంతో సహకారం అందించారని అన్నారు. భారత్ పెట్టుబడులకు స్వర్గధామమని.. మొబిలిటీ రంగంలో తమ భవిష్యత్తును రూపొందించుకోవాలని చూస్తున్న ప్రతీ పెట్టుబడిదారుడికి భారతదేశం అత్యుత్తమ గమ్యస్థానంగా నిలుస్తుందని అన్నారు. 'భారత్ మొబిలిటీ ఎక్స్ పో 2025'ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. పెరుగుతున్న మధ్యతరగతి, వేగవంతమైన పట్టణీకరణ, సరసమైన వాహనాలు భారతదేశంలో ఆటో రంగాన్ని ముందుకు తీసుకువెళుతున్నాయని ప్రధాని పేర్కొన్నారు. దాదాపు 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని, వీరు వాహనాలను కొనుగోలు చేయాలనుకుంటున్నారని ప్రధాని మోదీ చెప్పారు. ఈవీలను ప్రోత్సహించడానికి పలు ప్రాంతాల్లో ఛార్జింగ్ పాయింట్లను ఏర్పాటుచేశామన్నారు.మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం దేశంలో ఆటో పరిశ్రమ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిందన్నారు. ఈ దశాబ్దం చివరికి ఎలక్ట్రిక్ వాహనాల(ఇ÷ఎ)అమ్మకాలు ఎనిమిది రెట్లు పెరుగుతాయని అన్నారు. 5 ఏళ్ల క్రితం ప్రారంభించిన ఫ్రేమ్-2 పథకం కింద రూ.8000 కోట్లకు పైగా సబ్సిడీగా ఇచ్చామని ప్రధాని పేర్కొన్నారు. దీంతో 16 లక్షలకు పైగా ఎలక్ట్రిక్ బస్సులు ఏర్పాటుచేశామన్నారు. దిల్లీలోనే 1200 కంటే ఎక్కువ ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయని తెలిపారు. ఒకప్పుడు భారతదేశంలో నాణ్యమైన రోడ్లు లేకపోవడంతో ప్రజలు కార్లు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపకపోయేవారని ప్రధాని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితి మారుతుండటంతో కార్లకు డిమాండ్ పెరుగుతోందన్నారు. ఏడాదికి దాదాపు 2.5 కోట్ల కార్లు విక్రయమవుతున్నాయని తెలిపారు. దేశ రాజధానిలోని భారత మండపంలో నేడు ప్రారంభమైన 'భారత్ మొబిలిటీ ఎక్స్ పో.. 22వ తేదీ వరకు జరగనుంది. యశోభూమి, గ్రేటర్ నోయిడాలోని ఇండియా ఎక్స్‌పో సెంటర్/మార్ట్ వేదికల్లో ఎక్స్‌పో కొనసాగనున్నట్లు నిర్వాహకులు

# రూపాయిని నిలబెట్టే ప్రయత్నాలేవీ ?

**జనవరి 17 (రిపబ్లిక్ న్యూస్):**
ఆర్థిక మందగమనం, ద్రవ్యోల్బణం, రూపాయి పతనం ఇప్పుడు దేశాన్ని కుదిపేస్తున్నాయి. వీటి ప్రభావం ధరలపై పడుతోంది. తద్వారా సామాన్యుడు విలవిల్లాడుతున్నాడు. మరో పదిరోజుల్లో బడ్జెట్ ప్రవేశ పెట్టేందుకు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మరోమారు సిద్ధమవుతున్న వేళ..ఈ దిద్దుబాటు చర్యలు ఉంటాయా అన్నది అనుమానంగానే ఉంది. ఎవరిదారి వారిది అన్న చందంగా ప్రభుత్వం నడుస్తోంది. ధరలు అదుపులోకి రావడం లేదు. నిరుద్యోగం తీరడం లేదు. రూపాయి విలువను కాపాడే ప్రయత్నాలు జరగడం లేదు. కానీ బడ్జెట్‌లో దిగుమతి సుంకాలు పెంచే ప్రయత్నం చేస్తామని అంటున్నారు. ఇలా చేయడం వల్ల రూపాయి విలువ పెరుగుతుందనుకుంటే పొరపాటు. నేలవిడిచి సాము చేస్తున్న చందంగా కేంద్రం చర్యలు ఉంటున్నాయి. నిజానికి చైనాను చూసి మనం ఎంతో నేర్చుకోవాల్సి ఉంది. అధిక జనాభాను ఉపయోగిం చుకుని వస్తూత్పత్తిన పెంచుకుని ప్రపంచ మార్కెట్ పెంచుకునే ప్రయత్నాలు చేయడం లేదు. అలాగే గత పదేళ్లుగా మోడీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు ఏనాడూ రూపాయిని నిలబెట్టే ప్రయత్నాలు చేయలేదు. అందుకే డాలర్ ముందు రూపాయి తేలిపోతోంది. రోజురోజుకూ విలువ కోల్పోతూ తన రికార్డును తానే బద్దలుకొడుతోంది. ఇటీవల రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే..రూ. 87కు చేరువలో ఉంది. సమీపకాలంలో రూపాయి విలువ మరింత పతనం కావచ్చునని ఆర్థికవేత్తలు అంచనావేస్తున్నారు. అయినా ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ మాత్రం కొత్తంగా ఏయే పన్నులు వేయవచ్చో..వేటిని జిఎస్టీ కిందకు తీసుకుని రావవచ్చో అన్న ఆలోచనలో ఉన్నట్లుగా ఉంది. 2014లో ఎన్నికల ప్రచారంలో నరేంద్ర మోదీ రూపాయి పతనం గురించి చేసిన వ్యాఖ్యలు అందరూ గుర్తుకు తెచ్చుకోవాల్సిన తరుణమిది. దేశ రక్షణ గురించి గానీ,రూపాయి పతనం గురించి గానీ మన్మోహన్‌సింగ్ ప్రభుత్వానికి పట్టింపు లేదని మోదీ అప్పట్లో ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ఆయనతో పాటు, ఆయన ప్రధాని కావాలని కోరుకున్న ప్రముఖులంతా రూపాయి పతనం మీద చేసిన వ్యాఖ్యలు అప్పుడే మరచిపోలేం.ఎందుకంటే రూపాయి పతనం అప్పటి కన్నా వేగంగా పతనం అవుతోంది. అప్పట్లో రూపాయి గురించి గుండెలుబాదుకున్న వారంతా ఇప్పుడు ఎందుకో నోరువిప్పడం లేదు. ఇప్పుడు రూపాయి పతనం ఎంతగా పడిపోతున్నా ఎందుకనో మన మైనముని మోడీ మాత్రం నోరు విప్పడం లేదు. మన్మోహన్ సింగ్‌ను మౌనముని అంటూ దెప్పి పొడిచిన మోడీ ఇప్పుడు తాన అతిపెద్ద మౌనమునిగా మారారు. రూపాయి విలువ దారుణంగా పడిపోవడంతో ఆర్థిక నిపుణుల్లో ఆందోళన నెలకొంది. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా దిద్దుబాటు చర్యలేవీ ఫలితాలు ఇవ్వడం లేదు. సెప్టెంబర్ నెల నుండి రూపాయి పతనం స్పష్టంగానే కనిపిస్తోంది. సెప్టెంబర్ 12న డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ రూ.83.98కి పడిపోయింది. అప్పట్లో అదో రికార్డు. ఆ స్థాయికి రూపాయి విలువ పడి పోవడం అదే మొదటిసారి కావడంతో కలకలం రేగింది. మార్కెట్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మోదీ ప్రభుత్వానికి ఈ విషయమే పట్టని.. ఫలితంగా పతనంలో రూపాయి కొత్త రికార్డులు సృష్టించడం ప్రారంభమైంది. రూపాయి విలువ తగ్గిపోతోంది కాబట్టి మన జేబులో డబ్బు ఎక్కువగా ఖర్చు చెయ్యాల్సి వస్తోంది. అందువల్ల దిగుమతులపై సుంకాలు విధిస్తే సరిపోతుందన్న భావనలో మోడీ ప్రభుత్వం ఉంది. ఇదొక్కటే సరిపోదు. మనదేశ ఎగుమతులు పెరగాలి. మన మార్కెట్ పెరగాలి. మన వస్తువులు ప్రపంచాన్ని తాకాలి. అప్పుడే రూపాయికి బలం చేకూరుతుంది. మేకిన్ ఇండియా నినాదంగా మారడంతో వస్తూత్పత్తి పడిపోయింది. కార్మికులు పనులు లేకుండా పస్తులు ఉంటున్నారు. అందుకే గత పదేళ్ళలో డాలర్‌తో రూపాయి మారకపు విలువ 25 శాతం పతనమైంది. అప్పట్లో నెలకు రూ.10వేలు సంపాదించేవారు సంసరాన్ని ఈడ్చుకుని వచ్చేవారు. కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో నెలకు దాదాపు రూ.50వేల దాకా సంపాదించాలి. ఆ స్థాయిలో సామాన్యుల వేతనాలు పెరుగుతున్నాయా అంటే లేదు. కాబట్టి రూపాయి పతనం వల్ల నష్టపోతున్నది పేదలు, మధ్య తరగతివారు, సామాన్యులే. పదేళ్ల కిందట ఒక డాలర్ కోసం మనం 63 రూపాయలు చెల్లించాల్సి వచ్చేది. మరి ఇప్పుడు 87 రూపాయలు చెల్లించాల్సి వస్తోంది. ఇదివరకు కూరగాయలు కొంటే 100 రూపాయలకి సంచినిండేది, ఇప్పుడు 500 రూపాయలు పెట్టినా నిండట్లేదు. ఒక్క కూరగాయలే కాదు, ఇంట్లో వాడే ప్రతీ నిత్యావసరం ధరా పెరుగుతూనే ఉంటుంది.



ఇప్పుడు నిత్యావసర వస్తువుల ధరలు కూడా దారుణంగా పెరిగాయి. పప్పుల ధరలు 250కి కిలోగా ఉన్నాయి. ధరలు మరింత పెరగడం ఖాయం. రూపాయి పతనం వల్ల పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు బాగా పెరుగుతాయి. మనం విదేశాల నుంచి చమురును ఎక్కువగా కొంటున్నాం, భారీగా చెల్లింపులు జరుపు తున్నాం కనుక విలువ ప్రభావం ఇక్కడ అధికంగా ఉంటుంది. కోడిగుడ్డు ఒక రూపాయి నుంచి గత సంవత్సరం 5 రూపాయలు అయ్యింది. ఈ సంవత్సరం 7 రూపాయలు అయ్యింది. కోళ్ల దాణా, కరెంటు ఖర్చు, కూలీ వేతనాలు, నిర్వహణ ఖర్చులు, రవాణా ఖర్చులు ఇలా అన్నీ పెరుగుతూ గుడ్డు ధర కూడా పెరిగింది. ఇలా ఒకదానిపై ఒకటి ఆధారపడుతూ ధరలు పెరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికైనా బలమైన అడుగులు పడకపోతే, భారతదేశం మరింతగా నష్టపోవడం ఖాయం. మన ఎగుమతులను, ఉత్పాదకత సామర్థ్యాలను పెంచుకోవాల్సిన అవసరం ఉన్నది. ఉద్యోగ కల్పన, మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టాలి. దీంతో ఉత్పత్తి పెరిగి ఎగుమతుల ద్వారా విదేశీ మారక ద్రవ్యం ఆర్జించి రూపాయి స్థిరీకరణ చేయవచ్చు. దేశీయంగా ఎలక్ట్రానిక్స్ సంస్థలు నెలకొల్పి, ఉన్నవాటి సామర్థ్యాన్ని ఉత్పత్తిని పెంచి దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహించాలి. దిగుమతుల్లో ప్రముఖపాత్ర వహిస్తున్న ఇంధన అవసరాల కోసం దేశీయ సంస్థల్ని పురికొల్పి, ఎక్కువ ఉత్పత్తిని సాధించాలి. ప్రత్యామ్నాయ ఇంధన వనరుల ఉత్పాదకతను పెంచడం ద్వారా స్వయం సమృద్ధి సాధించాలి. మనకు సహజవనరులతో పాటు, మానవ వనరులు విశేషంగా ఉన్నాయి. వాటిని ఉపయోగించుకుని వస్తూత్పత్తని పెంచుకుంటే తప్ప ముందుకు సాగలేం. ఇలాగే మీనమేషాలు లెక్కిస్తూ జిఎస్టీ పెంచడం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాలని చూస్తే సామాన్యుల బతుకులు ఛిద్రం కాగలవని గుర్తించాలి.

## 19తో ముగియనున్న ఉత్తర ద్వార దర్శనాలు

### 21 నుంచి ఇక సర్వ దర్శనాలకు టిటిడి ఏర్పాట్లు



తిరుమల: కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవారి ఆలయంలో ప్రస్తుతం వైకుంఠ ద్వార దర్శనాలు కొనసాగుతున్నాయి. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఈనెల 10 నుంచి తిరుమలలో వైకుంఠ ద్వారాలు తెరుచుకున్నాయి. దాదాపు పది రోజుల పాటు టీటీడీ వైకుంఠ ద్వార దర్శనాలు కల్పించింది . దీంతో పెద్ద సంఖ్యలతో భక్తులు తిరుమల శ్రీవారిని వైకుంఠ ద్వారం గుండా ప్రవేశించి దర్శనం చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు ఏడురోజులుగా వైకుంఠ ద్వార దర్శనాలు కొనసాగుతున్నాయి. లక్షల్లో భక్తులు ఉత్తర ద్వారం గుండా స్వామి వారిని దర్శించుకున్నట్లు టీటీడీ అధికారులు చెబుతున్నారు.మరో మూడు రోజుల పాటు ఈ దర్శనాలు కొనసాగనున్నాయి. ఈనెల 19వ తేదీతో వైకుంఠ ద్వార దర్శనాలు ముగియనున్నాయి. వైకుంఠ ద్వార దర్శనం నేపథ్యంలో తిరుమలలో అన్ని సేవలను టీటీడీ రద్దు చేసిన విషయం తెలిసిందే. ముఖ్యంగా సామాన్య భక్తులకే స్వామి వారి దర్శనం కల్పించేలా ఏర్పాటు చేశారు టీటీడీ అధికారులు. కాగా.. ఈనెల19తో వైకుంఠ ద్వార దర్శనాలు ముగియనున్న నేపథ్యంలో శ్రీవారి భక్తులకు టీటీడీ శుభవార్త చెప్పింది. శ్రీవారి సర్వదర్శనాలను 20 నుంచి పునరుద్ధరించబోతోంది. అందుకోసం ఏర్పాట్లు చేస్తోంది. దీనికి సంబంధించి టీటీడీ ఈవో శ్యామలరావు సమీక్ష సమావేశం నిర్వహించారు. అదనపు ఈవో వెంకయ్యచౌదరి, ఇతర అధికారులు ఈ సమావేశంలో పాల్గొని సర్వదర్శనాలపై చర్చలు జరిపారు. నెల 19తో వైకుంఠ ద్వార దర్శనం ఎస్ఎస్‌డీ టోకెన్ల జారీ ముగియనుంది. ఈనెల 20న స్వామి వారి సర్వదర్శం కోసం వచ్చే భక్తులకు 19న ఎస్ఎస్‌డీ టోకెన్లను జారీ చేయరని.. వారు సర్వదర్శనం క్యూలైన్‌లలో నేరుగా స్వామివారిని దర్శించుకోవచ్చని టీటీడీ ఈవో వెల్లడించారు. అలాగే 19న ఆన్‌లైన్‌లో కూడా శ్రీవాణి దర్శన టికెట్లను జారీ చేయరని తెలిపారు. అలాగే 20న ప్రోటోకాల్ భక్తలకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనం కూడా రద్దు చేశామని.. ఈ నేపథ్యంలో 19న వీఐపీ బ్రేక్ దర్శనం కోసం సిఫార్సులను స్వీకరించబోమని టీటీడీ ఈవో శ్యామలారావు పేర్కొన్నారు. కాగా.. ఈనెల 21 నుంచి శ్రీవారి సర్వదర్శనం టోకెన్స్‌ని ఏ రోజుకు ఆ రోజూ జారీ చేయనున్నారు. అలాగే రద్దు చేసిన ఆర్జిత సేవలు కొనసాగుతాయి.

## అమెరికన్లను దెబ్బతీస్తున్న హెచ్-1బి

### లాకెన్ రిలే చట్టాన్ని సవరించాల్సిందే - అమెరికన్ సెనెటర్ బెర్నీ శాండర్స్ వెల్లడి

**వాషింగ్టన్,జనవరి 17 (రిపబ్లిక్ న్యూస్):**
మంచి వేతనాలను అందుకునే అమెరికన్ ఉద్యోగులను తొలగించేందుకే హెచ్-1బి ఉపయోగపడుతోందని అమెరికన్ సెనెటర్ బెర్నీ శాండర్స్ ఆరోపించారు. వారి స్థానంలో తక్కువ వేతనాలకే వచ్చే విదేశీ కార్మికులను అధిక సంఖ్యలో కంపెనీలు నియమించుకుంటున్నాయని ఆక్షేపించారు. హెచ్-1బి వీసాలకు అవకాశం కల్పిస్తున్న లాకెన్ రిలే చట్టాన్ని సవరించాలని కోరుతూ చట్టసభలో ఒక ప్రతిపాదనను శాండర్స్ ప్రవేశపెట్టారు. హెచ్-1బి వీసాల కోసం కంపెనీలు చెల్లించాల్సిన రుసుములను రెట్టింపు చేయాలన్నారు. దీని ద్వారా లభించే ఆదాయంతో 20వేల మంది అమెరికన్ విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇవ్వవచ్చని తెలిపారు. హెచ్-1బి కార్మికులకు కంపెనీలు చెల్లించే వేతనాలను కూడా భారీగా పెంచాలని డిమాండ్ చేశారు. తక్కువ వేతనాలకు వచ్చే విదేశీ కార్మికులను నియమించుకోవడం ద్వారా కార్పొరేట్ సంస్థలు భారీ మొత్తంలో డబ్బును మిగుల్చుకుంటున్నాయని విమర్శించారు. హెచ్-1బి వీసాలను సమర్థిస్తున్న టెస్లా అధినేత ఎలాన్ మస్క్, భారతీయ అమెరికన్ పారిశ్రామికవేత్త వివేక్ రామస్వామిలపైనా శాండర్స్ విమర్శలను సంధించారు. ఇదిలావుంటే హెచ్1బి వీసాలను ఆసియావాసులు దుర్వినియోగం చేస్తున్నారనీ ఉన్నత చదువుకోసం వచ్చి ఉద్యోగాలను




ఎగరేసుకుపోతున్నారనీ ప్రస్తుతం అమెరికాలో చెలరేగిపోతున్న విమర్శల వెనుకా మెజారిటీ శ్వేత జాతీయవాద విపరీత పోకడ వెల్లడవుతోంది. అమెరికన్ల ఉద్యోగాలను కొట్టేస్తున్నారన్న విమర్శ ఆసియావాసులను ప్రస్తుతం క్షోభపెడుతోంది. చదువు ముగిసిన తర్వాత ఉద్యోగాలు చేసే కాలాన్ని బాగా తగ్గించాలనే డిమాండు ఊపందుకుంటోంది. ఇది జరిగితే బాగా నష్టపోయేది భారతీయులే. లక్షలు ఖర్చుపెట్టి అమెరికాలో చదువుతున్న మొత్తం విదేశీ విద్యార్థుల్లో 25 శాతం పైగా భారతీయులే ఉన్నారు. అభివృద్ధిచెందిన దేశాల్లో పలుచోట్ల జనాకర్షణ, ఉన్మాద నినాదాలతో ఓట్ల రాజకీయాల్లో పైచేయి సాధిస్తున్న నేతల్లో విపరీత జాతీయవాద పోకడలు లేని వాళ్లను వేళ్లమీద లెక్కపెట్టొచ్చు. ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా గెలవటంతో ఈ విపరీతం మోతాదు బాగా మించిపోతోంది. వలసదారులకు, శరణార్థులకు సురక్షిత ప్రదేశంగా ఉన్నప్పుడే అమెరికా ఘనత గొప్పగా ఉంటుందని కెన్నడి ప్రగాఢంగా చెప్పారు. పౌరహక్కుల చట్టమే లేకపోతే ప్రజాస్వామ్యం గురించి, సమన్యాయపాలన గురించి, పౌరసమానత్వం గురించి ప్రపంచానికి నీతులు చెప్పే నైతిక అర్హతే అమెరికాకు ఉండేది కాదు. అవకాశాల సీమగా ఇప్పటికీ అమెరికాను పరిగణిస్తూ ప్రతి ఏటా దాదాపు లక్షల మందికి పైగా ప్రజలు అక్కడికి వెళుతున్నారు. 2021-24 మధ్య సగటున ఏడాదికి 24లక్షల మంది అక్కడికి చేరుకున్నారు. 1965 నుంచి చూస్తే క్రమేపీ లాటిన్ అమెరికా, ఆసియా నుంచి అమెరికాకు వెళ్లే వారి సంఖ్య బాగా పెరిగింది. మొత్తం వలసదారుల్లో 50 శాతం వారే ఉన్నారు. ఇంతగా వెళుతున్న వారందరికీ అక్కడ సమభావనతో సమాజంలో స్వాగతం లభిస్తోందనీ ఇప్పటికీ చెప్పలేం. ఎన్నోరూపాల్లో శ్వేతజాతి ఆధిక్యతా ధోరణులు ఎదురవుతున్నాయి. వలసల చరిత్రలోని విషాదాలనూ రాజకీయాలనూ జాతి ఆధిక్యతా ధోరణులనూ తెలుసుకుంటేనే ఈనాటి ట్రంప్ విధానాల నేపథ్యమూ అర్థం అవుతుంది. అమెరికా ఆధిక్యతకూ శ్వేతవర్ణానికీ పెద్దపీట వేయాలనే తర్కానికి ట్రంప్‌తో మళ్లీ ఊపు వచ్చినా దాని మూలాలు ఇప్పటివి కావు! ఆధిపత్య భావజాలాలపై ఆధారపడిన జాతీయవాదాలు ఎక్కడైనా నిలువరించాల్సిందే.

## రాష్ట్రపతి చేతుల మీదగా పలువురికి అవార్డులు, ఖేల్‌రత్న పురస్కారాలు అందజేత

ప్రతిష్టాత్మక మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న పురస్కారాలను తాజాగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రదానం చేశారు. దిల్లీ వేదికగా జరిగిన ఈ వేడుకల్లో అవార్డు గ్రహీతలైన అథ్లెట్స్ పాల్గొని సందడి చేశారు. హాకీ విభాగంలో హర్మన్‌ప్రీత్ సింగ్, చెస్ విభాగంలో డి.గుకేశ్, షూటింగ్ విభాగంలో మను బాకర్, పారా అథ్లెట్ విభాగంలో ప్రవీణ్ కుమార్ ఈ ప్రతిష్టాత్మక అవార్డులు అందుకున్నారు. ఇక తెలుగు రాష్ట్రాల నుంచి పారా అథ్లెట్? జివాంజీ దీప్తి, జ్యోతి యర్రాజీ కూడా ఖేల్ రత్న అవార్డులు అందుకున్నారు. ఇక వీరితో పాటు మరో 32 మంది అర్జున, ఐదుగురు అథ్లెట్లు ద్రోణాచార్య పురస్కారాలు అందుకున్నారు. లైఫ్‌టైమ్? కేటగిరీలో బ్యాడ్మింటన్ స్టార్ మురళీధరన్, ఫుట్‌బాల్ ప్లేయర్ అర్మాండో ఆగ్నెలో కొలాకో రాష్ట్రపతి చేతుల మీద ఈ అత్యున్నత పురస్కారాలు అందుకున్నారు.
అర్జున అవార్డు అందుకున్న అథ్లెట్స్? :
అన్ను రాణి (అథ్లెటిక్స్), నీతూ (బాక్సింగ్), స్వీటీ బురా (బాక్సింగ్), సలీమా(హాకీ), వంతిక





అగర్వాల్(చెస్), అభిషేక్ (హాకీ), అభయ్ సింగ్(స్క్వాష్), సంజయ్(హాకీ), హర్మన్‌ప్రీత్ సింగ్(హాకీ), సజన్ ప్రకాశ్ (స్విమ్మింగ్), స్వప్నిల్ సురేశ్? కుసాలే(షూటింగ్), సరబ్‌జోత్ సింగ్ (షూటింగ్), సుఖ్‌జీత్ సింగ్(హాకీ), అమన్ (రెజ్లింగ్).అర్జున అవార్డు అందుకున్న పారా అథ్లెట్స్? :రాకేశ్ కుమార్(పారా ఆర్చర్), సిమ్రాన్(పారా అథ్లెటిక్స్), మనీశా రాందాస్(పారా బ్యాడ్మింటన్), ప్రీతి పాల్(పారా అథ్లెటిక్స్), హెచ్. హొకాటో(పారా అథ్లెటిక్స్), అజీత్‌సింగ్(పారా అథ్లెటిక్స్), సచిన్ సర్జేరావు ఖిలారి(పారా అథ్లెటిక్స్), ప్రణవ్(పారా అథ్లెటిక్స్), నిత్యశ్రీ



సుమతి శివన్(పారా బ్యాడ్మింటన్), నవ్‌దీప్(పారా అథ్లెటిక్స్), నితీశ్ కుమార్(పారా బ్యాడ్మింటన్), తులసీమతి మురుగేశన్(పారా బ్యాడ్మింటన్), కపిల్ పర్మార్(పారా జూడో), మోనా అగర్వాల్(పారా షూటింగ్), రుబినా ఫ్రాన్సిస్(పారా షూటింగ్).
ద్రోణాచార్య అవార్డులు (కోచ్‌లు)
సుభాశ్? రాణా (పారా షూటింగ్), సందీప్ సంగ్వాన్ (హాకీ), దీపాలీ దేశ్‌పాండే (షూటింగ్).
అర్జున అవార్డ్స్ (లైఫ్‌టైమ్)
మురళీకాంత్ రాజారాం పెట్కర్ (పారా స్విమ్మింగ్),



సుచా సింగ్ (అథ్లెటిక్స్).
ఇదిలా ఉండగా, గతేడాది షమీతో పాటు చెస్ గ్రాండ్‌మాస్టర్ ఆర్.వైశాలీ, పిస్టల్ షూటింగ్ సెన్సేషన్ ఈషా సింగ్, రెజ్లర్ అంతిమ్ పంఘాల్, బాక్సర్ మహమ్మద్ హుస్సాముద్దీన్, పారా ఆర్చర్ సీతల్ దేవీ అర్జున అవార్డు అందుకున్నారు. చెస్ క్రీడాకారుడు ప్రజ్ఞానందా కోచ్ ఆర్?బీ రమేశ్? ద్రోణాచార్య పురస్కారాన్ని అందుకున్నారు.

# "తప్పి పోయిన మరియు గుర్తించ బడని పిల్లల కేసులపై డిస్టిక్ లెవెల్ అధికారుల మానిటరింగ్ మీటింగ్"






**కర్నూలు ప్రతినిధి జనవరి 17 (రిపబ్లిక్ న్యూస్):** సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కర్నూలు బి. లీలా వెంకట శేషాద్రి న్యాయ సేవా సదన్ నందు "తప్పి పోయిన మరియు గుర్తించ బడని పిల్లల కేసులపై డిస్టిక్ లెవెల్ అధికారుల మానిటరింగ్ మీటింగ్" నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ జుబేదా బేగం, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శారదా, అసిస్టెంట్ చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ రేవతి జ్యోత్స్న, మహిళ పోలీస్ ఆఫీసర్ మద్దిలేటి , డి. సి. ఆర్. బి. హేడ్ కానిస్టేబుల్ శేష మొదలగువారు పాల్గొన్నారు. గుర్తించ బడని పిల్లలు కేసులపై తీసుకొన్న చర్య లపై చర్చించారు.

# రాయలసీమలో సాగునీరు అందించండి

## : కొత్తూరు సత్యం



**కర్నూలు ప్రతినిధి జనవరి 17 (రిపబ్లిక్ న్యూస్):** రాయలసీమ ప్రాంతంలో సాగునీరు అందించేందుకు పాలకులు నిర్లక్ష్యం వహించడం మానుకోవాలని రాయలసీమ రాష్ట్ర ఉద్యమ నాయకులు కొత్తూరు సత్యనారాయణ గుప్త ఆవేదన వ్యక్తం చేశారు శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలో ఉన్న జిల్లాలో ఉపాధి లేక వలసలకు పోతున్నారని విభజన హామీలను నెరవేర్చడంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు ఆంధ్ర ప్రాంతానికి రావాల్సిన వాటా తెలంగాణ నుంచి రాకపోవడం పై ఎవరు నోరు మెదపడం లేదన్నారు . సంక్రాంతి కారణంగా సుమారు 5 లక్షల మంది హైదరాబాదు నుండి ఇప్పటికైనా పాలకులు ఆలోచన చేసి ప్రాంతాలవారీగా అభివృద్ధి చేస్తే ఎక్కడి వారు అక్కడ జీవనం సాగిస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయ అవకాశాలు పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. సంక్రాంతి పండుగ కారణంగా హైదరాబాద్ నగరం తో పాటు మిగతా తెలంగాణ ప్రాంతంలో ఉన్న ఆంధ్ర ప్రాంతం వారు లేకపోవడంతో బోసిపోతున్నాయని అభిప్రాయం కూడా ఉందన్నారు . ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలని ఆయన కోరారు. తెలంగాణలో వలసలకు వెళ్తుంటే తెలంగాణ ప్రాంతం వాళ్లు ఇతర ప్రాంతాలకు వలసలకు పోతున్నారని ఇది విడ్డూరం కాదా అని ఎద్దేవా చేశారు. రాయలసీమ ప్రాంతం బంగారు సిరులు పండించే ప్రాంతంగా మారుస్తామని రతనాలసీమగా మారుస్తామని మాటల్లో తప్ప చేతుల్లో లేదన్నారు. ఇకనైనా పాలకులు వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు .

# వేంపెంట నెత్తికొప్పుల.చెన్నమ్మ పార్థివ దేహానికి పూలమాలవేసి, నివాళులర్పించిన

## సింగపూర్ తెలుగు సమాజం ఉపాధ్యక్షుడు డాక్టర్ టేకూరి.నాగేశ్వరరావు

### ఆమె కుటుంబానికి 5000 రూపాయల ఆర్థిక సహకారం



**పాములపాడు జనవరి 17 (రిపబ్లిక్ న్యూస్):** పాములపాడు మండలంలోని, వేంపెంట గ్రామములో తెలుగుదేశం కార్యకర్త నెత్తికొప్పుల.యోసేపు తల్లి నేత్తికొప్పుల.చెన్నమ్మ చనిపోయిన విషయం తెలుసుకొని సింగపూర్ తెలుగు సమాజం ఉపాధ్యక్షుడు , అంతర్జాతీయ సమాజ సేవకుడు- డాక్టర్ టేకూరి.నాగేశ్వరరావు ఆమె పార్థివదేహానికి పూలమాల వేసి, నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వరల్డ్ హ్యూమన్ రైట్స్ అవార్డు గ్రహీత డాక్టర్ టేకూరి.నాగేశ్వరరావు ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి, 5000 రూపాయల ఆర్థిక సహాయం అందించారు. తెలుగుదేశం పార్టీ మీకు అన్ని విధాలుగా తోడుగా ఉంటుందని, ధైర్యంగా ఉండాలని కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ బోనపల్లె సత్యరాజ్, నీటి సంఘం డిసి -వైస్ ప్రెసిడెంట్ ఆల్ఫ్రెడ్, నెత్తికొప్పుల రత్నాకర్, గాండ్ల రాజేష్, బోనపల్లె వినయ్,నాగేశ్వర నాయక్, గాండ్లసుబ్బారావు,తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ బత్తుల సంజీవరాయుడు కు నంది అవార్డు ప్రధానం



**పాములపాడు , జనవరి 17 , రిపబ్లిక్ న్యూస్:** బీ దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన నంది అవార్డును మినిస్ట్రీ ఆఫ్ కల్చర్ , శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం మరియు శ్రీ సాయి నాట్యాంజలి ఫైన్ ఆర్ట్స్ డెవలప్మెంట్ అసోసియేషన్ వారు డాక్టర్ బత్తుల సంజీవనాయుడుకు ప్రధానం చేశారు. %ణతీ%. బత్తుల సంజీవ రాయుడు గత 40 సంవత్సరముల నుండి గ్రామీణ అభివృద్ధి , సాంఘిక సంక్షేమం, శిశు సంక్షేమం , మహిళా అభివృద్ధి , పర్యావరణ పరిరక్షణ, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల సంక్షేమం, విద్యా , వైద్య జంతు సంక్షేమం, నీటి సంరక్షణ మొదలగు రంగాలలో అంకిత భావంతో విశేషమైన కృషి చేసినందుకు సేవారత్న జాతీయ అవార్డును ప్రధానం చేశారు . ఈయన జాతీయ బీసీల కార్యదర్శిగా, భారత ప్రభుత్వంలో ట్రాయ్ కాగ్ మెంబర్గా , టెలికం గ్రాంట్ సౌత్ ఇండియా కమిటీ మెంబర్గా, బిఎస్ఎన్ఎల్ ఏపీ స్టేట్ అడ్వైజర్ మెంబర్గా , జియో ఏపీ స్టేట్ అడ్వైజరీ నెంబర్ గా , వోడాఫోన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అడ్వైజరి మెంబర్గా, టాటా సెల్ కంపెనీ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అడ్వైజర్ మెంబర్గా ప్రస్తుతం కొనసాగుతూ, బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు . 1991లో జిల్లా కలెక్టర్ అవార్డును , 1992లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి అవార్డు ,1997లో నిఖిల్ కువైతార జాతీయ అవార్డు, 2000 సంవత్సరంలో రాష్ట్రపతి అవార్డు , 2004 సంవత్సరంలో ప్యాప్సీ జాతీయ అవార్డు , 2017 వ సంవత్సరంలో ఇంటర్నేషనల్ పీస్ అవార్డు , 2022 సంవత్సరంలో గాంధీ పీస్ అవార్డు లతోపాటు ఇంకా ఎన్నో జాతీయ అంతర్జాతీయ అవార్డులు స్వీకరించారు. రాష్ట్రంలోని స్వచ్ఛంద సేవా సంస్థలు, ప్రజా సంఘాలు , మహిళా సంఘాలు , యువజన సంఘాలు , రాజకీయ నాయకులు , పార్టీలు , ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ నాయకులు తమ హర్షాన్ని వ్యక్తం చేశారు.

# కర్నూల్ నగరంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఫ్రైడే - డ్రైడే అవగాహన





**కర్నూలు. జనవరి17(రిపబ్లిక్ న్యూస్):** కర్నూలు నగరంలోని గడ్డ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తెలుగు గేరీలో ఫ్రై డే-డ్రైడే కార్యక్రమములో మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన చర్యలగురించి మరియు దోమల వలన వచ్చే డెంగ్యూ,మలేరియా ,చికూన్ గున్యా, ఫైలేరియా, మెదడువాపు, వంటి ఇతర వ్యాధుల గురించి వివరించినారు. మరియు పరిసరాల పరిశుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి చుట్టూ పరిసరాలలో నీటి నిలువలు ఏర్పడి అందులో దోమలు వృద్ధి చెంది పై వ్యాధులు సంభవిస్తాయని తెలిపారు,కావున ఇంటి పరిసరాలలో పాడైన వస్తువులన్నింటిని ఎప్పటికప్పుడు తొలగించుకుంటూ నీటి నిలువలు లేకుండా చూసుకోవాలని తెలిపారు. . ప్రతి ఒక్కరూ ప్రతి శుక్రవారము ఫ్రైడే %-%డ్రైడే పాటిస్తే దోమలను,గుడ్లు,లార్వా, ప్యూపా దశలోనే చంపి వేయగలుగుతామని తెలిపారు.. ఆరోగ్యకార్యకర్తలు మరియు ఆశా కార్యకర్తలతో కలిసి కాలనీలో ఇంటింటికి తిరిగి ఏడిస్ లార్వాలను గుర్తించి వాటిని నిర్మూలించేందుకు చర్యలు తీసుకున్నారు. అనంతరం ఆశా కార్యకర్తలతో లార్వా ఉన్న ప్రదేశాలపై పిచ్చికారి చేయించినారు..ప్రభుత్వం ఆసుపత్రులలో జ్వరానికి సంబంధించిన అన్నీ రక్త పరీక్షలు ,మందులు ఉచితంగా ఇస్తారని తెలిపారు, ఈ కార్యక్రమములో డిప్యూటీ డెమో చంద్ర శేఖర్ రెడ్డి ,ఆరోగ్య విద్యా బోధకురాలు పద్మావతి గారు ,సచివాలయ ఆరోగ్య కార్యకర్త నాగమ్మ రిసోర్స్ పర్సన్ సునీత , తిరుపతమ్మ ఆశా కార్యకర్త మరియు ప్రొజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.

# శివ దీక్షాపరులకు 25 సంవత్సరాల నుంచి అన్నదానము ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించడం చాలా గొప్ప విషయం :ఎస్ వి దంపతులు






**కర్నూలు ప్రతినిధి జనవరి 17 (రిపబ్లిక్ న్యూస్):** ఈరోజు మాజీ ఎమ్మెల్యే మరియు వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు ఎస్ వి మోహన్ రెడ్డి మరియు ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు మాజీ అధ్యక్షురాలు శ్రీమతి ఎస్ వి విజయ మనోహర్ నగరంలోని నగరేశ్వర స్వామి దేవాలయంలో శ్రీశైల శివ దీక్ష పరుల సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు . ఎస్ వి మోహన్ రెడ్డి మాట్లాడుతూ నగరేశ్వర స్వామి దేవాలయంలో గత 25 గత సంవత్సరాల నుంచి శివమాల ధరించిన శివ భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయడం చాలా అభినందనీయమైన విషయమని ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని గత 25సంవత్సరాల నుంచి ఏర్పాటు చేయడం, ఆ కైలాసనాధుడి కృపా కటాక్షాలు శివ దీక్షాపరుల సేవా సమితికి ఎల్లప్పుడు ఉంటాయని అన్నారు. ఇదే సందర్భంగా నగరంలో ఉన్న శివ దీక్ష స్వీకరించిన భక్తులు అవకాశాన్ని ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు శ్రీమతి ఎస్.వి. విజయ మనోహరి గారు మాట్లాడుతూ అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని శివదీక్ష స్వీకరించిన స్వాములకు సేవ చేయడం అంటే భోళా శంకరుడికి సేవ చేసినట్లేనని అన్నారు. కార్యక్రమంలో దేవస్థానం పాలకమండలి సభ్యులు భక్తులు వైఎస్ఆర్సిపి నాయకులు పాల్గొన్నారు.

# జై బాపూజీ, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్రను విజయవంతం చేయండి

## డిసిసి అధ్యక్షులు పి మురళీకృష్ణ






**కర్నూలు ప్రతినిధి జనవరి 17 (రిపబ్లిక్ న్యూస్):** జై బాపూజీ, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్రను విజయవంతం చేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు మాజీ సభ్యులు పి మురళి కృష్ణ కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన జిల్లాస్థాయి సమీక్ష సమావేశంలో మురళీకృష్ణ గారు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కేంద్రమంత్రి అమిత్ షా పార్లమెంటులో చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ అతను వెంటనే దేశ ప్రజలకు క్షమాపణ చెప్పి రాజీనామా చేయాలని కోరుతూ అఖిల భారత కాంగ్రెస్ కమిటీ పిలుపుమేరకు, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శ్రీమతి వైయస్ షర్మిల రెడ్డి గారి ఆదేశాల మేరకు ఈనెల 22వ తేది దేశవ్యాప్త పాదయాత్రలో భాగంగా కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టబోయే పాదయాత్రలో కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మురళీకృష్ణ కాంగ్రెస్ శ్రేణులను కోరారు. ఈ పాదయాత్ర 22వ తేదీ ఉదయం 10:30 నిమిషాలకు జిల్లా పార్టీ కార్యాలయం నుండి ప్రారంభమై నెహ్రూ రోడ్, చౌక్ బజార్, గడియారం హాస్పిటల్, పెద్ద మార్కెట్ మీదుగా పాత బస్టాండు వద్దగల అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకొని అక్కడ మీటింగ్ జరుగునని తెలియజేశారు. కనుక ఈ పాదయాత్రకు కర్నూలు జిల్లా నందలి సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కర్నూలు జిల్లా నందలి అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల కాంగ్రెస్ కోఆర్డినేటర్లు అనుబంధ సంస్థలయిన జిల్లా మహిళా కాంగ్రెస్ యువజన కాంగ్రెస్ సేవాదళ్ ఎస్సీ ఎస్టీ ఓబీసీ మైనార్టీ సెల్ లీగల్ సేల్ ఐఎన్టియుసి ఎన్ ఎస్ యు ఐ డాక్టర్ సెల్ కిసాన్ సెల్ కల్చరల్ సెల్ నాయకులు మండల కాంగ్రెస్ అధ్యక్షులు, కార్యకర్తలు, అంబేద్కర్ అభిమానులు శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో ఈ పాదయాత్రలో పాల్గొని విజయవంతం చేయవలెనని మురళీకృష్ణ గారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మూలింటి మారెప్ప మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్ బాబు సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలాని భాష నియోజక వర్గాల కోఆర్డినేటర్లు ఎం కాసింవలి, బి క్రాంతి నాయుడు, చిప్పగిరి లక్ష్మీనారాయణ, పి మురళీకృష్ణరాజు ఓబీసీ జిల్లా చైర్మన్ డివి సాంబశివుడు ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు బి బతుకన్న జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ సుంకన్న కాంగ్రెస్ నాయకులు దేవిశెట్టి ప్రకాష్ ఎన్ సి బజారన్న ఎస్ ప్రమీలమ్మ ఏ వెంకట సుజాత షేక్ ఖాజా హుస్సేన్ ఖాద్రి పాషా, అనంతరత్నం మాదిగ సయ్యద్ నవీద్, అమనుల్లా ఈ లాజరస్ యజాస్ అహ్మద్ షేక్ మాలిక్ బి సుబ్రమణ్యం డబ్ల్యూ సత్యరాజు వెల్దుర్తి శేషయ్య తుగ్గలి రవి ఆర్ విక్టర్ జోసెఫ్ నోయల్ జాన్ సదానందం రమేష్ వశీ భాష ఐ ఎన్ టి యు సి ఆర్ ప్రతాప్ ఆనందం ఆశీర్వాదం నడిపిన్న రంగస్వామి మహిళా కాంగ్రెస్ మల్లేశ్వరి శ్రీలత అయ్యమ్మ మొదలగు వారు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

**పేదల స్థలం కబ్జా చేసినద**

**ప్రజాబంధు పార్టీ నాయకుడు.**

**మా స్థలం మాకు ఇప్పించండి అంటూ మొరపెట్టుకుంటున్న మహిళలు.**

**రోడ్డున పడ్డ బాధిత కుటుంబ సభ్యులు.**

**ప్రశ్నిస్తే బెదిరింపులకు**

**పాటుపడుతున్న పల్లె నాగరాజు**





**నందికొట్కూరు, జనవరి 17, (రిపబ్లిక్ న్యూస్):** పొట్టకూటి కోసం బ్రతుకు తెరువు కోసం ఇతర జిల్లాలకు వలస వెళ్లిన శ్రమజీవుల స్థలాన్ని ప్రజాబంధు పార్టీ నాయకుడు పల్లె నాగరాజు కబ్జా చేసి బాధితులను రోడ్డుపాలు చేసిన వైనం నందికొట్కూరు లోనే మారుతి నగర్ లో వెలుగు చూసింది. ఈ సంఘటనపై శుక్రవారం మీడియా సమావేశంలో బాధితులు మారుతి నగర్ కాలనీవాసులు తెలిపిన వివరాల మేరకు ఈ విధంగా ఉన్నాయి. నందికొట్కూరు పట్టణంలోనే మారుతి నగర్ సర్వే నంబర్లు 777,778, మరియు కొన్ని సర్వే నంబర్లలో 2020,లో 34 మంది దళిత మాల సామాజిక వర్గానికి చెందిన వారికి అప్పటి తాసిల్దారు ఇళ్ల పట్టాలు మంజూరు చేసింది. ఇందులో భాగంగానే శెట్టి జయమ్మ నాగన్న కుటుంబ సభ్యులకు ప్లాట్ నెంబర్ 832 స్థలము కేటాయించడం జరిగింది.అయితే వారి ఆర్థిక పరిస్థితి కారణంగా గుంటూరు, తదితర జిల్లాలకు పొట్టకూటి కోసం ఎండుమిర్చి వలస వెళ్లడం జరిగింది.ఇదే అలసగా భావించిన పల్లె నాగరాజ అనే వ్యక్తి పేదల ఇంటి స్థలంపై కన్నేశాడు. క్రిస్టియన్ ప్రార్థన మందిరం పేరుతో సాకుగా చూపి స్థలాన్ని కబ్జా చేసినట్లు బాధితుల ఆరోపిస్తున్నారు. తములేని సమయంలో రేకుల షెడ్డు అక్రమంగా ఏర్పాటు చేసుకొని 2023లో రోడ్డుపాలు చేశాడని కన్నీటి పర్వతమయ్యారు. ఇది ఏమిటని ప్రశ్నించిన కాలనీపై సగ్గేలా విజ్జి, సల్వాదీ రమేష్, మరో ఇద్దరిపై తప్పుడు ఆరోపణలు చేస్తూ కరపత్రాన్ని ముద్రించడంపై తమను బెదిరిస్తూ బ్లాక్మెయిల్ చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నాడని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి అతనిపై, విచారించి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. ఈ సమావేశంలో దళిత సంఘాల నాయకులు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రతి నెల మూడవ శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్

**ఉపాధి హామీ పనుల కల్పనలో అలసత్వం ఉండకూడదు**

**వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందుగానే సమ్మర్ యాక్షన్ ప్లాన్ రూపొందించాలి**

**రీ సర్వే గ్రామ సభల్లో వచ్చిన అర్జీలను జనవరి చివరి నాటికి పరిష్కరించాలి**

**ఎమ్ఎస్ఎమ్ఈ సర్వే ను వేగవంతం చేయండి - జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**




కర్నూలు, ప్రతినిధి జనవరి 17: (రిపబ్లిక్ న్యూస్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి నెల మూడవ శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాలను చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు..శుక్రవారం కలెక్టరేట్ నుండి స్వచ్ఛ దివస్, హౌసింగ్,రెవెన్యూ సదస్సులు, పిజిఆర్ఎస్, ఉపాధి హామీ తదితర అంశాలపై స్పెషల్ ఆఫీసర్లు, డివిజన్, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు..

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనవరి 18వ తేదీ మూడవ శనివారం స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి గారు కడప జిల్లా మైదుకూరులో ప్రారంభిస్తున్నారన్నారు. స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల ఒక థీమ్ తో మూడవ శనివారం పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా జనవరి మాసంలో "న్యూ ఇయర్ - క్లీన్ స్టార్ట్" అన్న థీమ్ తో స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరుగుతుందన్నారు.. ప్రతి గ్రామంలో బహిరంగ ప్రదేశాలయిన బస్ స్టాప్ లు, మార్కెట్ యార్డ్ లు, చెత్త ఎక్కువగా ఉన్న ప్రదేశాలు, డ్రెయిన్స్ ను శుభ్రం చేయడం, పబ్లిక్ టాయిలెట్స్ ను శానిటైజ్ చేయడం, పిచ్చి మొక్కలను తీసి వేయడం వంటి శుభ్రపరిచే కార్యక్రమాలను చేపట్టాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.. ఈ కార్యక్రమం ద్వారా మున్సిపాలిటీ, పంచాయతీల్లో ఉన్న పెద్ద చెత్త కుప్పలను తొలగించి వాటిని చెత్త సంపద తయారీ కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఈఓపిఆర్డి, ఎంపిడిఓలు, పంచాయతీ సెక్రటరీ లను ఆదేశించారు.... పరిశుభ్రత పై ప్రజలకు అవగాహన కల్పించే విధంగా ర్యాలీలు నిర్వహించాలని, క్యాంపెయిన్ మోడ్ లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి, విజయవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, ఎన్జీఓలు, పాఠశాల, కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొనేలా ఎంపిడిఓలు, తహాశీల్దార్లు, మండల స్పెషల్ ఆఫీసర్లు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.. ఈ కార్యక్రమంలో భాగంగా అన్ని శాఖల అధికారులు వారి వారి కార్యాలయాల పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా ఫిబ్రవరి మాసంలో "సోర్స్ - రిసోర్స్" అనే థీమ్ తో స్వచ్ఛ దివస్ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఉపాధి హామీ పనులకు సంబంధించి కూలీలకు పనులు కల్పించడం లో అలసత్వం ఉండకూడదన్నారు.. మంత్రాలయం, గూడూరు, గోనెగండ్ల, కోసిగి మండలాలలో కూలీలు వలసలకు వెళుతున్నారనే వ్యతిరేక కథనాలు పత్రికల్లో వస్తున్నాయని, సంబంధించిన గ్రామాలను సందర్శించారా? పనులు కల్పిస్తున్నప్పటికీ కూలీలు వలసలకు వెళ్తున్నారా? పనులు కల్పించకపోవడం వల్ల వారు వలసలకు వెళుతున్నారా? సంబంధింత గ్రామాల్లో ఎన్ని సెల్ఫ్ ఆఫ్ వర్క్ లను కేటాయించారు? అన్న వివరాల ను కలెక్టర్ ఎంపిడిఓ లను అడిగి తెలుసుకున్నారు.. పత్రికల్లో కూలీలు వలసలకు వెళ్తున్నారని వార్తలు వచ్చినప్పుడు, వెంటనే స్పందించి సంబంధిత గ్రామాలను సందర్శించి, వలసలను వెళ్లవద్దని, ఉపాధి పనులను కల్పిస్తామని భరోసా కల్పించాలని, గ్రామాల్లో ఈ విధమైన అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.. ప్రతి గ్రామ పంచాయతీలో పనులు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు.. పెండింగ్ లో ఉన్న గోకులం లను కూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు..ఆర్డబ్ల్యూఎస్ కు సంబంధించి అంగన్వాడీ కేంద్రాల్లో పెండింగ్ లో ఉన్న టాయిలెట్ నిర్మాణాలు, త్రాగు నీటి వసతుల కల్పన పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.. ప్రధానంగా యాస్పిరేషనల్ బ్లాక్ ల లో పెండింగ్ ఉన్న పనులను ముందుగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు..

రానున్న వేసవి లో నీటి ఎద్దడి లేకుండా ఉండేందుకు వీలుగా సమ్మర్ యాక్షన్ ప్లాన్ రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు.. గ్రామాల వారీగా మరమ్మత్తులకు అవసరమైన నిధులు, ట్రాన్స్పోర్టేషన్ ద్వారా ఏ గ్రామాలకు నీరు అందిస్తున్నామన్న పూర్తి వివరాలతో యాక్షన్ ప్లాన్ అందచేయాలని కలెక్టర్ సబ్ కలెక్టర్, ఆర్డీవో లను ఆదేశించారు.. ఈ అంశంపై సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

పిజిఆర్ఎస్ కి సంబంధించి రీ సర్వే జరిగిన గ్రామ సభలో వచ్చిన అర్జీలలో కేవలం 60 శాతం అర్జీలు మాత్రమే పరిష్కరమయ్యాయని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.... పెద్ద కడుబూరు మండలంలో ఎక్కువ అర్జీలు పెండింగ్ లో ఉన్నాయని, మండల సర్వేయర్ మెటర్నిటీ లీవ్ లో ఉన్నపుడు ఆ స్థానంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఎందుకు చేయలేదని కలెక్టర్ ఏడి సర్వే , పెద్ద కడుబూరు తహసిల్దార్ లను ప్రశ్నించారు. వారం లోపు పెండింగ్ లో ఉన్న అర్జీలను డిస్పోస్ చేయాలని కలెక్టర్ పెద్ద కడుబూరు తహసిల్దార్ ను ఆదేశించారు.. అదే విధంగా అర్జీల వివరాలను తీసుకొని రావాలని కలెక్టర్ పెద్ద కడుబూరు తహసిల్దార్ ను ఆదేశించారు..అలాగే కౌతాళం లో కూడా ఎక్కువ పెండింగ్ లో ఉన్నాయని, ఆ వివరాలను కూడా తీసుకుని రావాలని కలెక్టర్ కౌతాళం తహసిల్దార్ ను కూడా ఆదేశించారు.. మంత్రాలయం, హొళగుంద, కర్నూలు రూరల్ , ఓర్వకల్లు, వెల్దుర్తి , ఆస్పరి, దేవనకొండ, హాళహర్వి , నందవరం, ఎమ్మిగనూరు, సి.బెళగల్ మండలాల్లో కూడా పెండింగ్ లో ఉన్నాయని వాటిని కూడా త్వరితగతిన పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత మండల తహసీల్దారులను ఆదేశించారు.. హౌసింగ్ కు సంబంధించి జిల్లా రాష్ట్రంలో 8వ స్థానంలో ఉందన్నారు.. ఇళ్ల నిర్మాణాలలో కొన్ని మండలాల్లో పురోగతి బాగుందని, కొన్ని మండలాల్లో మరింత ప్రగతిని సాధించాల్సి ఉందని కలెక్టర్ పేర్కొన్నారు..ఆలూరు, హాలహర్వి, ఆదోని, ఆదోని అర్బన్, గోనెగండ్ల, హొళగుంద మండలాల్లో కేవలం 40 శాతం పురోగతి మాత్రమే సాధించారని, చిప్పగిరి, మంత్రాలయం, నందవరం, పత్తికొండ మండలాల్లో కూడా 50 శాతం పురోగతి మాత్రమే సాధించారని, అయా మండలాల ఎంపిడిఓలు ప్రత్యేక దృష్టి సారించి పురోగతి సాధించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు...అలాగే ఆప్షన్-3 కింద చేపడుతున్న ఇళ్ళ నిర్మాణాలకు సంబంధించి పురోగతిలో వెనుకబడిన మండలాల్లో నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పంచాయతీ రాజ్ సిసి రోడ్ల నిర్మాణాలకు సంబంధించి గోనెగండ్ల, ఓర్వకల్లు, చిప్పగిరి, హాలహర్వి, ఎమ్మిగనూరు మండలాల్లో సిసి రోడ్లు నిర్దేశించిన సమయానికి 100 శాతం పూర్తి చేశారని, ఆయా సదరు మండలాల అధికారులను కలెక్టర్ అభినందించారు. మిగతా మండలాలకు సంబంధించి ఎంపిడిఓలు, పంచాయతీ రాజ్ ఇంజనీర్లు సమన్వయంతో పని చేసి వారంలోపు రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నారు. రానున్న రోజుల్లో మిగతా పనులకు సంబంధించి కూడా అనుమతులు ఇవ్వడం జరుగుతుందని, వాటిని కూడా మార్చిలోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఎమ్ఎస్ఎమ్ఈ సర్వే ప్రారంభించి నెల రోజులైనప్పటికీ పురోగతి లో చాలా వెనుకబడి ఉన్నామని, పురోగతి సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని ఈ అంశంపై మండల స్పెషల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు...క్యాస్ట్ సర్వే కు సంబంధించి షెడ్యూల్ ప్రకారం జనవరి 20వ తేది లోపు వచ్చిన అర్జీలను పరిష్కరించి సచివాలయాలలో లిస్ట్ పబ్లిష్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.. గోనెగండ్ల, కర్నూల్ అర్బన్, ఆదోని, తుగ్గలి, పత్తికొండ, ఆస్పరిలో పెండింగ్ ఉన్నాయని, వీటిని ఆన్లైన్ లో నమోదు చేసి, త్వరితగతిన పరిష్కరించి, లిస్ట్ పబ్లిష్ చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.గ్రామ సచివాలయ సర్వీసులకు సంబంధించి మిస్సింగ్ సిటిజన్స్ కి సంబంధించి కౌతాళం, కోసిగి, కర్నూలు (అర్బన్), ఆదోని, ఆదోని (రూరల్) మండలాల్లో ఎక్కువ శాతం పెండింగ్ లో ఉందని, డ్రైవ్ మోడ్ లో వాటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.. రైస్ కార్డ్స్, జియో కోఆర్డినేట్స్, పంచాయతీ అసెట్స్ క్యాప్చర్ తదితర అన్ని అంశాల్లో పెండింగ్ లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు . వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, హౌసింగ్ పిడి చిరంజీవి, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు..

## ప్రభుత్వ కార్యక్రమాలను పార్టీ కార్యక్రమాలు గా మారుస్తున్న కూటమి నేతలు-డివైఎఫ్ఐ



**కర్నూలు ప్రతినిధి జనవరి 17 (రిపబ్లిక్ న్యూస్):** పారా స్పోర్ట్స్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ దివ్యాంగుల క్రీడల ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీ జిల్లాస్థాయిలో 30వ తేదీ రాష్ట్రస్థాయిలో జరుగుతున్నయి. కర్నూలు జిల్లాలోని కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్యారా స్పోర్ట్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ దివ్యాంగుల క్రీడల పోస్టర్లను ఆవిష్కరించడాన్ని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాఘవేంద్ర నగేష్ తీవ్రంగా తప్పు పట్టారు. దివ్యాంగులకు క్రీడలు నిర్వహించడాన్ని అభినందిస్తూనే దివ్యాంగుల పట్ల కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు కు దివ్యాంగుల పట్ల వివక్ష చులకన భావం ఉండబట్టే కర్నూల్ లో ఇన్ని స్పోర్ట్స్ క్లబ్బులు ఉన్నప్పటికీ దివ్యాంగులకు ప్రభుత్వం నిర్వహించే క్రీడల పోస్టర్లను తన పార్టీ కార్యాలయంలో గోడపత్రికలను విడుదల చేశారని అన్నారు. వెంటనే దివ్యాంగులకు సోమిశెట్టి వెంకటేశ్వర్లు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాలను పార్టీ కార్యక్రమాలుగా మార్చుతున్నారని దీనివల్ల రాజకీయాలకతీతంగా మంచి ప్రతిభావంతులైన దివ్యాంగులు ఇది తెలుగుదేశం కార్యక్రమము అనుకొని దూరంగా ఉండాల్సిన పరిస్థితిని సోమిశెట్టి వెంకటేశ్వర్లు తీసుకువచ్చారని ఆరోపించారు. ప్రభుత్వ సొమ్ముతో నిర్వహించే ఏ కార్యక్రమాన్నైనా ప్రభుత్వ కార్యాలయాల్లోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు.

## కుక్క కాటుకి గురైన వెంటనే ఆస్పత్రికి వెళ్లాలి

**-డాక్టర్ ఇమ్రాన్ ఖాద్రీ, అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రభుత్వ వైద్యశాల కర్నూలు**






**కర్నూలు ప్రతినిధి జనవరి 17 (రిపబ్లిక్ న్యూస్):**చిన్నపిల్లల కి పాఠశాలల అనేక సెలవుల సందర్భంగా ఎక్కువమంది పిల్లలు కుక్క కాటుకు గురవుతున్న విషయం సర్వ సాధారణంగా జరుగుతుంది. కుక్కకాటుకు గురైన వెంటనే మంచినీటితో గాయాన్ని శుభ్రం చేసుకుని అందుబాటులో ఉన్న యాంటీబయటిక్ లోషన్ రాసుకోవాలి. వెనువెంటనే దగ్గర్లో ఉన్న పీ.హెచ్.చి, సి.హెచ్.చి, ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో డాక్టర్స్ నీ సంప్రదించాలి. కుక్క కాటు వల్ల పడిన గాయాన్ని బట్టి కోర్సు ప్రకారం వ్యాక్సిన్ అందిస్తారు. కాటు తీవ్రతను బట్టి వ్యాక్సినేషన్ ఉంటుంది. ఎలాంటి పత్యం ఉండాల్సిన అవసరం లేదు. ఇంటి దగ్గరే కుక్కలు పెంచుకునే వారు ఉంటే ఆ కుక్కలకు ముందుగానే వ్యాక్సిన్ వేయించాలి. ఇంట్లో మనుషులు కూడా ప్రి వ్యాక్సినేషన్ చేయించుకుంటే రాబిస్ వ్యాధి రాకుండా అరికట్టుకోవచ్చు. అన్ని రకాల ప్రభుత్వ ఆస్పత్రులలో కుక్క కాటుకు సంబంధించిన వ్యాక్సిన్లు అన్ని వేళలలో అందుబాటులో ఉంటాయి అని తెలిపారు.

## 8 వ రోజు పోలీసు కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహధారుద్య పరీక్షలు

**కానిస్టేబుల్ మెయిన్స్(ఫైనల్) పరీక్షకు 243 మంది అభ్యర్థులు ఎంపిక.**





**కర్నూలు ప్రతినిధి జనవరి 17 (రిపబ్లిక్ న్యూస్):** పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లా కు సంబంధించి కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్ధులకు కర్నూలు APSP రెండవ బెటాలియన్ లో 8 వ రోజు దేహదారుఢ్య పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి.ఈ దేహదారుఢ్య సామర్థ్య పరీక్షలను కర్నూలు జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపియస్ దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ రోజు 600 మంది అభ్యర్దులను పిలిచారు. 323 మంది అభ్యర్దులు బయోమెట్రిక్ కు హాజరయ్యారు. వీరికి సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ తర్వాత ఎత్తు, ఛాతీ వంటి ఫిజికల్ మెజర్మెంట్ టెస్టులు నిర్వహించారు.అనంతరం వీరందరికీ ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ లు 1600 మీటర్ల పరుగు, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పరీక్షలు నిర్వహించారు.1600 మీటర్ల పరుగు పరీక్షలో 270 మంది అభ్యర్థులు అర్హత సాధించారు.100 మీటర్ల పరుగు పరీక్షలో 152 మంది అభ్యర్థులు అర్హత సాధించారు.లాంగ్ జంప్ లో 240 మంది అభ్యర్థులు అర్హత సాధించారు.

కానిస్టేబుల్ మెయిన్స్(ఫైనల్) పరీక్షకు 8 వ రోజు 243 మంది అభ్యర్దులు అర్హత సాధించారు.

ఏదైనా సమస్యల పై , ఇతర కారణాలతో అప్పీలు చేసుకున్న అభ్యర్థులు జనవరి 28 వ తేదీన హాజరు కాగలరని జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపియస్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పాటు హోంగార్డు కమాండెంట్ సదరన్ రీజియన్ మహేష్ కుమార్, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి. హుస్సేన్ పీరా, ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, డిస్పీలు, సిఐలు, ఆర్ ఐలు, ఎస్సైలు, ఆర్ ఎస్సైలు, డిపిఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## విశాఖ ఉక్కు పరిశ్రమ కు జీవం

**టిడిపి రాష్ట్ర కార్యదర్శిఆంధ్ర ప్రదేశ్ ఆర్య వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్నంద్యాల నాగేంద్ర**



**కర్నూలు ప్రతినిధి జనవరి 17 (రిపబ్లిక్ న్యూస్):** విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు.. చెప్పిన మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు విశాఖ స్టీల్ప్లాంట్కు రూ. 11,440 కోట్లతో ఆర్థిక ప్యాకేజీ ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం.

చంద్రబాబు నాయుడు నిరంతర ప్రయత్నంతో విశాఖ స్టీల్ ప్లాంట్ కు ప్రత్యేక గ్రాంట్ ఇచ్చి మళ్ళీ ఊపిరి పోసిన కేంద్రం. నాడు 1999లో కూడా నాటి వాజ్ పాయ్ ప్రభుత్వాన్ని ఒప్పించి విశాఖ స్టీల్ కు ఆర్థిక ప్యాకేజీ తెచ్చి ఉపిరి పోసిన చంద్రబాబు. నేడు మళ్ళీ ప్రధాని మోడీ ఆంధ్రుల సెంటిమెంట్ వివరించి, ప్రైవేటీకరణ ఆపించి, ఆర్థిక ప్యాకేజీ వచ్చేలా చేసిన చంద్రబాబు గత 5 ఏళ్ళుగా, నాటి వైసీపీ ప్రభుత్వ కుట్రలు చేధించి, ప్రజల భాగస్వామ్యంతో, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ కాకుండా ఉద్యమాలు చేసింది తెలుగుదేశం పార్టీ. నేడు కూటమి ప్రభుత్వంలో, కేంద్రానికి పరిస్థితి వివరించి, మళ్ళీ విశాఖ ఉక్కుకి ఊపిరి , జీవం పోశారు.ఇక విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ కు స్వస్థి పలికినట్లే .

## కలెక్టరేట్ కార్యాలయంలో నేడు స్వచ్ఛత దివస్ పాటించాలి

**ఇంచార్జ్ జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు**





**కర్నూలు ప్రతినిధి జనవరి 17 (రిపబ్లిక్ న్యూస్):**కలెక్టర్ కాంప్లెక్స్ లోని అన్ని కార్యాలయాలు రేపు స్వచ్ఛత దివస్ ను పాటించి తమ కార్యాలయాలను శుభ్రపరచు కోవలసిందిగా ఇన్చార్జి జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం సాయంకాలం కలెక్టరేట్ కాంప్లెక్స్ లోని కార్యాలయాల అధికారుల సమావేశాన్ని ఇన్చార్జి జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు నిర్వహించారు. రేపటినుండి ప్రతినెల మూడవ శనివారం రోజును స్వచ్ఛత దివస్ పాటించవలసిందిగా కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కార్పొరేషన్ ఇచ్చే మార్గదర్శకాలను అనుసరించి జిల్లాలో అన్ని ప్రాంతాలు ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉండాలని ఆదేశించినందున కలెక్టరేట్ కాంప్లెక్స్ లో గల అన్ని కార్యాలయాలు ఎల్లప్పుడు తమ కార్యాలయాలు మరియు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిందిగాకోరారు. అవకాశమున్న కార్యాలయాలు పూల మొక్కలను పెంచుతూ పరిసరాలను సుందరంగా ఉంచుకోవాల్సిందిగా కోరారు. ఈ సమావేశానికి పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి శ్రీనివాసులు , జిల్లా కోపరేటివ్ అధికారి రామాంజనేయులు , ఇన్చార్జి చీఫ్ ప్లానింగ్ అధికారి భారతి మరియు ఇతర కార్యాలయాలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

## కమ్యూనిస్టు పార్టీ ఉద్యమనేత, తుదిశ్వాసవదిలేవరకుఓటమిమెరుగని

# కమ్యూనిస్టు మహా యోధుడు కామ్రేడ్ జ్యోతిబాసు





### : డి గౌస్ దేశాయ్.

**కర్నూలు ప్రతినిధి జనవరి 17 (రిపబ్లిక్ న్యూస్):** కర్నూల్ సిపిఎం పార్టీ న్యూ సిటీ కమిటీ ఆధ్వర్యంలో కామ్రేడ్ జ్యోతి బాసు 15వ వర్ధంతికార్యక్రమం కర్నూలు కార్మిక కర్షక భవన్ నందు ఉదయం10గంటలకుజరిగింది. ఈకార్యక్రమానికి సిపిఎం పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు సి.హెచ్ సాయిబాబా అధ్యక్షత జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఎం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి డి. గౌస్ దేశాయ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుఎం. నారాయణ, నగర కార్యదర్శివర్గసభ్యులుఆర్.నరసింహులు గారులు కామ్రేడ్ జ్యోతిబాసు గారి చిత్రపటానికి పూలమాలవేసినివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ జ్యోతిబాసుగారుఉన్నతకుటుంబంలో జన్మించి, లండన్ లో ఉన్నత చదువులు పూర్తి చేసుకుని, మార్క్సిస్టు భావాలకు ఆకర్షితుడై కమ్యూనిజం అజేయమని నమ్మి ఓటమి ఎరుగని నాయకుడిగా కమ్యూనిస్టు ఉద్యమ నేతగా, కార్మిక కష్టజీవుల నాయకుడిగా అలుపెరుగని పోరాటం చేసిన మహా యోధుడు, ప్రపంచంలో రష్యా, చైనా కమ్యూనిజాన్ని ఏ విధంగా ప్రపంచం చూసిందో ఆ విధంగా పశ్చిమ బెంగాల్లో భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్ అంటే ఇలాఉంటుందనితెలియజేసిబెంగాల్లో తిరుగులేని పార్టీని నిర్మించిన మహా నాయకుడు ఇందిరాగాంధీ ఎమర్జెన్సీని విధించి వామపక్ష ప్రభుత్వాన్నిపడగొట్టినసందర్భంలోతిరిగి బెంగాల్లో ఎన్నికలు జరిగితే కమ్యూనిస్టు పార్టీకి తిరుగులేని విజయంసాధించిపెట్టి ఇందిరా గాంధీకి సైతంముచ్చెమటలు పట్టించిన కమ్యూనిస్టు యోధుడు. రాజకీయ ఎత్తుగడలు చిత్తు చేయడంలో మహా జ్ఞాని, ప్రజలే నా బిడ్డలుగా భావించి, తన కుమారుని బడిలో చేర్పించిన సందర్భంలో తండ్రిగా తన పేరు నమోదు చేయకుండా గార్డియన్ పేరు నమోదు చేయించి ప్రజలందరికీ తండ్రిగా నిలిచాడు. పశ్చిమ బెంగాల్లో 35 సంవత్సరాలు ఎర్రజెండా రెపరెపలు ఎగరవేస్తూ కమ్యూనిస్టు పరిపాలన ఎలా ఉంటుందో చూపించాడు. భారతదేశంలో పేదలకు పంచిన భూమి ఎంత ఉందో అంత భూమిని ఒక్క బెంగాల్ రాష్ట్రంలోనే లక్షలాది ఎకరాలుభూమిని పంచి చరిత్ర సృష్టించాడు . 2010సంవత్సరంలో ఆయన మరణించినప్పుడు నా శరీరం వృధా కాకూడదు అని భావించివైద్యులకు పరీక్షలకు ఉపయోగపడే విధంగా తన అవయవాలన్నీ వైద్య పరీక్షల కోసం హాస్పిటల్ కు రాసి ఇచ్చినత్యాగశీలి మహా నేత జ్యోతిబాసు గారు మార్క్సిజం అజేయమని ఆయన చూపిన మార్గంలో పయనించి ఆయన అడుగుజాడల్లో పయనించినప్పుడే ఆయనకు ఘనమైన నివాళి అర్పించిన వారం అవుతామని వారు అన్నారు. సిపిఎంజిల్లా కమిటీ సభ్యులు సి.గురుశేఖర్, ఎం. నగేష్, ఓల్డ్ సిటీ నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ నగరకార్యదర్శి వర్గసభ్యులుకే. సుధాకరప్ప, కే.ప్రభాకర్, నగరనాయకులు ఎస్ఎండి మహమ్మద్ రఫీ, M.ఏసు, శ్రీనివాసులు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, ఆటో యూనియన్ నగర అధ్యక్షులు ఎస్.హుస్సేన్ వలి, షంషీర్, చిన్న మద్దిలేటి, విష్ణుమూర్తి, దేవరాజు, నరసింహ మొదలగు పాల్గొన్నారు.

# 18 రోజులు అయినా భారతి మృతదేహం లభించకపోవడంలో అంతర్యం





కర్నూలు ప్రతినిధి జనవరి 17 రిపబ్లిక్ న్యూస్: కర్నూలు జిల్లా పాణ్యం నియోజకవర్గం,కల్లూరు మండలం నాయకల్లు గ్రామంలో 2025 వ సంవత్సరం జనవరి 1 వ తేదీన మధ్యాహ్నం 12.00 గంటల సమయం నుండి వివాహిత మహిళ భారతి కనపడటం లేదు.కొద్దిమంది గ్రామస్థులు,అత్తింటి వారు మరియు ఉల్లిందకొండ పోలీసుల కథనం ఏమిటంటే భారతి కొత్త సంవత్సరం రోజున ఉదయం సుమారు 10.00 గంటల సమయంలో తన తోడికోడలుతో కలిసి కేక్ కట్ చేసి ఆనందంగా గడిపినదని ఆ తర్వాత మామకు చెప్పి పొలానికి వెళ్ళిందని, భారతి వెళ్ళిన కొద్ది సేపటికి భర్త రవికుమార్ కూడా వెళ్ళారని, పొలములో ఒక చెట్టు కింద భారతి తన భర్త కజిన్ బ్రదర్ అయిన రాఘవేంద్రతో వున్న దృశ్యాన్ని చూసి భార్య భారతితో నాయనకు చెబుతాను అంటూ భర్త ఇంటికి వెళ్ళి పోయాడంటా. భారతి హంద్రీనీవా కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్నది అని అటుగా బైక్ పై వస్తున్న గ్రామానికి చెందిన ఒక వ్యక్తి చూసి, సచివాలయం దగ్గరికి వెళ్లి అక్కడ వున్న వ్యక్తులకు చెప్పి వారిని తీసుకెళ్ళి కాలువలో చూడగా భారతి నీటిలో మునిగి చేతులు మాత్రం కనిపించాయని ఆ తర్వాత పూర్తిగా



మునిగిపోయిందని చెప్పారు. కాలువలో దూకిన భారతి శవం కానీ శవానికి సంబంధించిన ఆనవాళ్లు గానీ ఈరోజు వరకు లభించలేదు. కాలువలో దూకి చనిపోయిందంటున్న భారతి బాడీ 18 రోజులు అయినా లభించక పోవడంలో ఆంతర్యం ఏమిటి అని ప్రజాసంఘాలు, మహిళా సంఘాలు పోలీసు అధికారులను అడిగితే అదే అర్థం కావడం లేదని, అంతుచిక్కడం లేదని పోలీసులు సమాధానం చెబుతున్నారు. భారతి కాలువలో దూకే క్షణం ముందు వరకు రాఘవేంద్ర తో వుందని భర్త చెబుతున్నారు. పోలీసులు మాత్రం భర్తను గానీ, రాఘవేంద్రను గానీ అదుపులోకి తీసుకుని విచారించలేదు. పైగా భారతి తల్లిదండ్రులు,వారి బంధువులు కలిసి వారం తర్వాత ఉల్లిందకొండ యస్.ఐ గారిని కలిసి నిలదీస్తే అప్పుడు వారిని కస్టడీలోకి తీసుకున్నారు. కానీ పోలీసుల విచారణలో ఈరోజు వరకు ఏ విధమైన పురోగతి కలిగిన సమాచారాన్ని బాధితులకు ఇవ్వలేదు.భారతి మిస్సింగ్ అని కేసు కట్టిన ఉల్లిందకొండ పోలీసులు బాడీ కోసం వెతుకుతూనే......... వున్నారు. నియోజకవర్గం శాసనసభ్యురాలు మాత్రం ఫోన్లోనే అధికారులకు ఆదేశాలు ఇస్తూ బాధిత కుటుంబాన్ని మాత్రం ఈ రోజు వరకు పరామర్శించిన దాఖలాలు లేవు. డబ్బు లేని పేదలను పట్టించుకోరా, వారికి న్యాయం అందని ద్రాక్ష అన్నది స్పష్టం అవుతోంది. భారతి మిస్సింగ్ కేసు మరో ముచ్చుమర్రి కేసు గా మహిళా సంఘాలు ప్రజాసంఘాలు గొంతెత్తున్న పోలీసులు మాత్రం మాకు ఇలాంటివి మామూలే అన్నట్లు చూడటం బాధాకరం. భారతి మిస్సింగ్ కేసును చేధించడంలో పోలీసుల తీరుపై ఈ రోజు కర్నూలు నందలి స్థానిక అంబేద్కర్ భవన్లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో మహిళా సంఘాలు ప్రజాసంఘాలు ముక్తకంఠంతో నిరసిస్తూ సోమవారం కర్నూలు కలెక్టరు కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమానికి పిలుపునివ్వడం జరిగింది. అంతేకాకుండా న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించాలని నిర్ణయించడం జరిగింది.

# ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తో పీపుల్ టెక్ ఎంటర్ ప్రైజెస్ సంస్థ ప్రతినిధులు భేటీ

## -కర్నూలు జిల్లా ఓర్వకల్లులో ఎలక్ట్రిక్ వెహికిల్ పార్క్ ఏర్పాటు

**జనవరి 17 (రిపబ్లిక్ న్యూస్):** 'పర్యావరణహితమైన వాహనాల వినియోగం పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించడంపై గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు ప్రత్యేక దృష్టిపెట్టారు. ఇందులో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాలు విరివిగా అందుబాటులోకి రావాలి' అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి శ్రీ పవన్ కల్యాణ్ గారు తెలిపారు. శుక్రవారం సాయంత్రం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో పీపుల్ టెక్ ఎంటర్ ప్రైజెస్ సంస్థ ప్రతినిధులు ఉప ముఖ్యమంత్రివర్యులతో భేటీ అయ్యారు. ఈ సంస్థ ఓర్వకల్లు దగ్గర 12వందల ఎకరాల్లో ఎలక్ట్రిక్ వెహికిల్ పార్కు నెలకొల్పేందుకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వంతో ఎం.ఓ.యూ.



చేసుకొంది. ఇందుకు సంబంధించిన వివరాలను పీపుల్ టెక్ గ్రూప్ సి.ఈ.ఓ. శ్రీ టి.జి.విశ్వప్రసాద్ తెలియచేశారు. 'వాహన తయారీ, ఆర్. అండ్ డి. కేంద్రాలు, టెస్టింగ్ ట్రాక్స్, ప్లగ్ అండ్ ప్లే ఇండస్ట్రియల్ ప్రాంతాలాంటివి ఇందులో ఉంటాయి. దేశంలో ఇదే తొలి ప్రైవేట్ ఈ.వి. పార్కు. దీని ద్వారా రూ.13 వేల కోట్ల పెట్టుబడులు వస్తాయనీ, 25 వేల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయ'ని వివరించారు.

శ్రీ పవన్ కల్యాణ్ గారు స్పందిస్తూ 'కర్నూలు జిల్లా ఓర్వకల్లు దగ్గర ఎలక్ట్రిక్ వెహికిల్ పార్క్ ఏర్పాటు కానుండటం ఆహ్వానించదగ్గ పరిణామం. రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి ఇదొక మైలు రాయి. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు గారి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకి అనువైన విధానాలు తీసుకొచ్చింది' అన్నారు. ఉప ముఖ్యమంత్రివర్యులతో సమావేశమైన వారిలో శ్రీ భాస్కర రెడ్డి, శ్రీ రవికిరణ్ ఆకెళ్ళ, శ్రీ బాబ్ డఫ్ఫీ, శ్రీ స్టీవ్ గెర్బర్, శ్రీ హెరాల్డ్ రక్రిజెల్ ఉన్నారు.

# టీజీ వెంకటేష్ మంత్రిగా ఉన్నప్పుడు వేయించిన సిమెంట్ రోడ్డును కూడా వదలని బిల్డర్

**చెరువులు,వాగులు,ప్రభుత్వ భూముల కబ్జాలపై సర్వే వివరాలు ప్రజలకు తెలపాలి**

**బూ కబ్జాదారులను, వారికి సహకరించిన పలు శాఖల అధికారులపై చర్యలు తీసుకోవాలి : ఇరిగినేని పుల్లారెడ్డి**

**కర్నూలు ప్రతినిధి జనవరి 17 (రిపబ్లిక్ న్యూస్)**



జిల్లాలో వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూములు, రాజుల కాలం నాటి చెరువులు వాగులు వంకలు కబ్జాలకు గురైయ్యాయనీ ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వం మారీ ఆరు నెలలు గడిచినా సర్వేల పేరుతో సంబంధిత అధికారులు కాలయాపన చేస్తూనే.. ఉన్నారు. కొన్ని సందర్భాల్లో అధికార పార్టీకి చెందిన నాయకులు భూకబ్జాలపై ఆగ్రహం వ్యక్తం చేసినా అధికారుల్లో తగినంత స్పందన రావడంలేదు. గార్గేయపురం చెరువు మీదుగా నగరవనం వెళ్లేందుకు గతంలో టీజీ వెంకటేష్ మంత్రిగా ఉన్న సమయంలో వేయించిన సిమెంట్ రోడ్డును కూడా ఆ ప్రాంతంలో ఉన్న బత్తుల బిల్డర్ వదలలేదనీ.. పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, ఎం నాగరాజు, ఎస్ రమణ గౌడ్ ల ప్రతినిధి బృందం ఈరోజు ఉదయం కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు ఇచ్చిన వినతి పత్రంలో తెలిపారు. ప్రభుత్వ భూములు, బి తాండ్రపాడు, గార్గేయపురం చెరువులు, వరద నీరు వెళ్ళే వాగులు, వంకలను కబ్జా చేసిన.వారితోపాటు, సహకరించిన అధికారులపై కూడా చర్య తీసుకోవాలని కోరారు. వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను, వాగులను చెరువులో కబ్జాల నుండి కాపాడి వాటిని వెంటనే స్వాధీనం చేసుకోవాలని కోరారు.

# నందమూరి తారక రామారావు వర్ధంతి కార్యక్రమాలను పరిధిలో నిర్వహించగలరు

**:జిల్లా టిడిపి అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి**



కర్నూలు ప్రతినిధి జనవరి 17 (రిపబ్లిక్ న్యూస్): ఈ నెల 18వ తేదీన శనివారం తెలుగు చలనచిత్ర నటులు, తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపకులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రివర్యులు నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి కార్యక్రమాన్ని కర్నూలు జిల్లాలోని అన్ని నియోజకవర్గములు, మండలాలు, గ్రామాలలో నిర్వహించవలసినదిగా కర్నూలు పార్లమెంట్ తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి తెలుగుదేశం పార్టీ మంత్రులు, శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులు, శాసనమండలి సభ్యులు, నియోజకవర్గం ఇన్చార్జిలు, రాష్ట్ర / జిల్లా స్థాయిలో పార్టీలో వివిద హెరీదాలలో కొనసాగుతున్న నాయకులకు, కార్యకర్తలకు అబిమానులకు విజ్ఞప్తిచేశారు.ఈ రోజు పత్రికల వారితో మాట్లాడుతూ తెలుగుదేశంపార్టీని స్థాపించి, 9 నెలలో రాష్ట్రంలో అధికారంలోకి తీసుకొని వచ్చి, అట్టడుగు వర్గాల రాజకీయంగా ప్రోత్సాహించి, వారిని ఉన్నతస్థాయికి తీసుకొని వచ్చిన మహానేత యన్.టి.ఆర్. తెలుగువారికి ప్రత్యేక గుర్తింపును తీసుకొని వచ్చిన నందమూరి తారక రామారావు 29 వ ర్ధంతి తేది 18-01-2025 కర్నూలు జిల్లా అంతటా భారీఎత్తున నిర్వహించేందుకు ప్రతిఒక్కరు పాలుపంచుకోవాలనీ, ఈ సందర్భంగా రక్తదాన శిభిరాలను ఏర్పాటు చేయాలనీ, అలాగే అన్నదాన కార్యక్రమాలు, హాస్పటల్స్ నందు రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ వంటి సామాజిక కార్యక్రమాలను చేపట్టవలసినదిగా మన పార్టీ అదినేత చంద్రబాబునాయుడు ఆదేశమనీ, అందువల్ల ప్రతి నియోజకవర్గంలో సంభందిత యం.యల్.ఎ.లు, ఇన్చార్జీలు, అలాగే మండలస్థాయిలో పార్టీ మండల అధ్యక్షులు, ప్రధానకార్యదర్శులు, క్లిష్టర్, యూనిట్, బూతిస్థాయిల ఇన్చార్జీలు మీమీ పరిధిలో నిర్వహించి యన్.టి.ఆర్. ఉన్న అభిమానాన్ని చాటుకోవాలనీ, అలాగే యన్.టి.ఆర్.యన్.బి.కె. ఫ్యాన్స్ కూడా ఈ కార్యక్రమాలలో పాలుపంచుకొని తమ ఐక్యతను చాటుకోవాలని విజ్ఞప్తిచేస్తున్నాను.

# సీఎం సహాయనిధి చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే శ్యాంబాబు

**తుగ్గలి/పత్తికొండ ప్రతినిధిజనవరి 17 (రిపబ్లిక్ న్యూస్):**





ముఖ్యమంత్రి సహాయనిది ద్వారా మంజూరైన చెక్కులను పత్తికొండ శాసనసభ్యులు కేఈ శ్యాంబాబు లబ్ధిదారులకు అందజేశారు.శుక్రవారం రోజున పత్తికొండలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు ఎమ్మెల్యే కే.ఈ శ్యాంబాబు తుగ్గలి మండల పరిధిలోని గల జొన్నగిరి గ్రామానికి చెందిన సంఘాల ఆనందమ్మ కు 30,700 రూపాయల చెక్కును,రాంపల్లి గ్రామానికి చెందిన అంగడి సుభాష్ చంద్రబోస్ కు 30,200 రూపాయల చెక్కును పత్తికొండ ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. పత్తికొండ నియోజకవర్గం వ్యాప్తంగా ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన 3,80,000 రూపాయలను చెక్కుల రూపంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు,ఉపాధ్యక్షుడు వెంకట రాముడు చౌదరి,బీసీ సెల్ మండల అధ్యక్షుడు సంఘాల కృష్ణ,లక్ష్మణ స్వామి,మాజీ ఎంపిటిసి వల్లె వెంకటేష్, కిష్టయ్య,గిరిగెట్ల తిమ్మయ్య చౌదరి, తెలుగు యువత మండల అధ్యక్షుడు సత్య ప్రకాష్,శభాష్ పురం మోహన్ తదితర మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.కేంద్ర ప్యాకేజీ కేవలం ఆర్థిక పునరుద్ధరణ మాత్రమే కాదు... మన పెద్దలు త్యాగాలతో రాసిన వాగ్దానాన్ని నెరవేర్చడం. విశాఖ ఉక్కు కోసం ప్రాణ త్యాగాలు మన హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటాయి" అని పవన్ పేర్కొన్నారు.

# ఆలయ భూములు అన్యాక్రాంతం చేస్తే కఠిన చర్యలు

## - మహానంది ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి



మహా నంది, జనవరి 17, (రిపబ్లిక్ న్యూస్):మహానంది దేవస్థానానికి చెందిన భూములను ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మహానంది ఆలయ ఈవో నల్లకాలువ శ్రీనివాస రెడ్డి హెచ్చరించారు. మహానంది దేవస్థానానికి చెందిన తమ్మడపల్లె గ్రామ పరిధిలో ఉన్న సర్వే నంబర్ 303 లో 8.74 ఎకరాల అనకల ఇనాం భూములకు సంబంధించి ఇనాం దారులు పట్టాదారు పాస్ పుస్తకాలు తీసుకోవడంపై శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. మహానంది తహసీల్దార్ రమాదేవి ఆధ్వర్యంలో జరిగిన విచారణలో భాగంగా తమ్మడపల్లె గ్రామానికి చెందిన నాగ మోహన్, సుబ్బరాయుడు, వెంకటసుబ్బయ్య, మరొకరు వారు చేయించుకున్న పట్టాదారు పాస్ పుస్తకాలను దేవస్థానం, రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఈఓ శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఇనాం సర్వీసులు కింద ఇచ్చిన భూములను కేవలం జీవనాధారం కోసం మాత్రమే వినియోగించుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమించి ఎవరైనా పట్టాదారు పాస్ పుస్తకాలు పొంది, బ్యాంకుల్లో రుణాలు తీసుకుంటే తగిన చర్యలు తప్పవన్నారు. తహసీల్దార్ రమాదేవి మాట్లాడుతూ పట్టాదారు పాసు పుస్తకాల రద్దు కోసం జాయింట్ కలెక్టర్ కు పంపిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ మధు, ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్ రెడ్డి, ఆలయ అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



# 'హరిహర వీరమల్లు' మాట వినాలి..

టాలీవుడ్ యాక్టర్ పవన్ కల్యాణ్ పవన్ కల్యాణ్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న మోస్ట్ అవెయిటెడ్ ప్రాజెక్ట్ హరిహరవీరమల్లు. జ్యోతికృష్ణ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇస్మార్ట్ భామ నిధి అగర్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ మూవీ రెండు పార్టులుగా రానుండగా.. హరిహరవీరమల్లు పార్ట్ 1 మార్చి 28న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ఫస్టి సింగిల్ వినాలి.. వీరమల్లు మాట వినాలి ప్రోమో కూడా విడుదల చేయగా.. నెట్టింట వైరల్ అవుతోంది. తాజాగా ఫుల్ లిరికల్ వీడియో సాంగ్ లాంచ్ చేశారు. ఏం గుల్పామ్ ఏం గురాయించి చూస్తున్నవ్ భయపెట్టనీకా..? ఓహో చాలా మందిని చూసినాంలే బిడ్డా. హే మునిమాణిక్యం చూసినవా.. గురాయించి చూస్తుండు బేటా.. మన లెక్క తెల్వదు.. వినాలి.. వీరమల్లు మాట చెబితే వినాలి.. అంటూ తెలంగాణ యాసలో పవన్ కల్యాణ్ స్టైల్‌లో సాగుతున్న లిరిక్స్ ఆకట్టుకుంటూ.. అభిమానులను థ్రిల్ చేస్తున్నాయి. పెంచల్ దాస్ రాసిన ఈ పాటను ఎంఎం కీరవాణి కంపోజిషన్‌లో పవన్ కల్యాణ్ పాడాడు. ఈ సాంగ్ సినిమాకే హైలెట్‌గా నిలువనుందనడంలో ఎలాంటి సందేహం లేదు. పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ మూవీలో బాలీవుడ్ నటుడు, దర్శక నిర్మాత అనుపమ్ ఖేర్, అర్జున్ రాంపాల్, నర్గీస్ ఫక్రీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ చిత్రాన్ని మేఘ సూర్య ప్రొడక్షన్ బ్యానర్‌పై ఏ దయాకర్‌రావు నిర్మిస్తున్నారు. ఏఎం రత్నం సమర్పికుడిగా వ్యవహరిస్తున్నారు. క్లైమాక్స్‌లో వచ్చే రెడ్ డ్రెస్ ఫైట్‌ను 42 రోజులపాటు చిత్రీకరించారని ఇన్‌సైడ్ టాక్. ఇక ఈ చిత్రంలో ఇంట్రో సాంగ్, టైగర్ ఫైట్, మహల్ యాక్షన్ పార్ట్, కుస్తీ ఫైట్ సీన్, చార్మినార్ యాక్షన్ సన్నివేశాలు, ప్రీ ఇంటర్వెల్, ఇంటర్వెల్ భారీ యాక్షన్ సీక్వెన్స్, క్లైమాక్స్ వార్ సీన్ అభిమానులకు గూస్ బంప్స్ తెప్పించబోతున్నాయట.

# లైలా టీజర్.. తెల్లగ చేసుడే కాదు తోలు తీసుడు కూడా..!




మాస్ కా దాస్ విశ్వక్ సేన్ లీడ్ రోల్ లో రాం నారాయణ దర్శకత్వంలో వస్తున్న సినిమా లైలా. షైన్ స్క్రీన్ బ్యానర్ లో సాహు గారపాటి ఈ సినిమా నిర్మిస్తున్నారు. విశ్వక్ సేన్ సరసన ఆకాంక్ష శర్మ హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమా నుంచి టీజర్ రిలీజైంది. మేకప్ మేన్ గా అందరినీ తెల్లగా చేస్తున్న సోను మీద కొందరు పగబడతారు. అతని మీద రివెంజ్ తీర్చుకోవాలని అనుకుంటారు. ఐతే సోను మాత్రం తెల్లగ్ చేసుడే కాదు తోలు తీసుడు కూడా వచ్చని తన పంజా విసురుతాడు. చివర్లో విశక్ సేన్ లేడీ గెటప్ అదిరిపోయింది. ఓ విధంగా ఈ టీజర్ చూసి సినిమాపై అంచనాలు భారీగా పెరిగేలా ఉందని చెప్పొచ్చు. మాస్ కా దాస్ విశ్వక్ సేన్ ఇమేజ్ కి కరెక్ట్ బొమ్మ అనిపించేలా ఈ సినిమా వచ్చింది. టీజర్ తోనే విశ్వక్ ఫ్యాన్స్ కి ఫుల్ జోష్ ఇచ్చాడు. ఇక ఈ సినిమా కోసం విశ్వక్ లేడీ గెటప్ మాత్రం నెక్స్ట్ లెవెల్ అనిపించేలా ఉంది. మాస్ కా దాస్ ఫ్యాన్స్ కి సినిమా కంటెంట్ కి తగినట్టుగా కావాల్సినన్ని డబుల్ మీనింగ్ డైలాగ్స్ తో అదరగొట్టాడు. సినిమా యూత్ ఆడియన్స్ కి ఇన్ స్టంట్ గా ఎక్కేలా ఉంది. మొన్న సిద్ధు జొన్నలగడ్డ డీజే టిల్లుగా వస్తే ఇప్పుడు విశ్వక్ సేన్ మేకప్ మెన్ సోనుగా వస్తున్నాడు. టీజర్ తో ఇంపాక్ట్ క్రియేట్ చేయడంలో సక్సెస్ అయిన విశ్వక్ సేన్ ఈ సినిమాతో ఎలాంటి రిజల్ట్ అందుకుంటాడో చూడాలి. ఈ సినిమాను ఫిబ్రవరి 14న రిలీజ్ ఫిక్స్ చేశారు మేకర్స్. సినిమా టీజర్ తోనే ఇదొక పక్కా యూత్ ఫుల్ కామెడీ ఎంటర్టైనర్ గా రాబోతుందని హింట్ ఇచ్చారు. ఐతే విశ్వక్ సేన్ వన్ మ్యాన్ షోగా సినిమా ఉంటుందని ఈ టీజర్ చూస్తే అర్థమవుతుంది. కెరీర్ లో ఒక సాలిడ్ సూపర్ హిట్ కోసం ఎదురుచూస్తున్న విశ్వక్ సేన్ సోను పాత్రలో తను చేసిన హంగామాతో వస్తున్న ఈ లైలా ఎలాంటి సక్సెస్ కొడుతుంది అన్నది మాస్ కా దాస్ ఫ్యాన్స్ కి ఆసక్తికరంగా ఉంది.

# అనిల్ రావిపూడి హిట్ మెషీన్.. ఇది మరో రికార్డ్!



తెలుగు చిత్ర పరిశ్రమలో వరుస హిట్స్ అందుకున్న దర్శకుల లిస్ట్ చాలా తక్కువ. ఇక అలాంటి వాటిలో క్రమంగా అత్యంత విజయవంతమైన దర్శకుడిగా ఎదిగారు అనిల్ రావిపూడి. ఈ కమర్షియల్ మేకర్ వరుస బ్లాక్‌బస్టర్లతో తన ప్రత్యేకతను నిరూపించుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఆయన దర్శకత్వంలో వచ్చిన ప్రతి సినిమా ఘనవిజయం సాధించడం అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంది. అనిల్ పటాస్ సినిమాతో తన సినీ ప్రయాణాన్ని మొదలు పెట్టిన విషయం తెలిసిందే. ఇక లేటెస్ట్ గా సంక్రాంతి కానుకగా విడుదలైన సంక్రాంతికి వస్తున్నాం సినిమా కూడా ఈ విజయ పరంపరలో తన స్థానాన్ని సంపాదించుకుంది. ఈ సినిమాలో వెంకటేశ్ హీరోగా నటించగా ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరి హీరోయిన్స్ గా నటించారు. సినిమా ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన అందుకుంది. అమెరికా బాక్సాఫీస్ వద్ద కూడా ఈ సినిమా 1 మిలియన్ డాలర్ల మార్క్‌ను అందుకుంది. ఇది అనిల్ రావిపూడి కెరీర్‌లో ఐదవ మిలియన్ డాలర్ చిత్రం కావడం విశేషం. గతంలో భగవంత్ కేసరి, ఎఫ్3, సరిలేరు నీకెవ్వరు, ఎఫ్2 సినిమాలు కూడా ఈ ఘనత సాధించాయి. అనిల్ రావిపూడి ప్రతి కథను కూడా కామెడీ యాక్షన్ అలాగే ఫ్యామిలీ డ్రామాలతో హైలెట్ చేస్తూ అన్ని వర్గాల ఆడియెన్స్ ను ఆకట్టుకుంటున్నాడు. ముఖ్యంగా సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో మరోసారి వెంకటేశ్ తన టైమింగ్ తో ఎట్రాక్ట్ చేశారు. ఈ చిత్రంలో కామెడీ, ఇద్దరు హీరోయిన్స్ మధ్య నలిగిన హీరో పరిస్థితిని మంచి కథాంశంతో చూపించారు. అనిల్ రావిపూడి ప్రస్తుతం 8/8 బ్లాక్‌బస్టర్లను అందుకున్న అరుదైన దర్శకుడిగా నిలిచారు. సుప్రీమ్, రాజా ది గ్రేట్ సినిమాలు కూడా బాక్సాఫీస్ వద్ద సాలిడ్ వసూళ్ళను అందుకున్నాయి. అనిల్ దర్శకత్వ శైలి సాధారణ ప్రేక్షకులను మాత్రమే కాకుండా అంతర్జాతీయంగా కూడా తెలుగు సినిమాకు మంచి గుర్తింపు తీసుకొస్తోంది. ప్రతిసారి కథలకు, పాత్రలకు కొత్తగా ప్రాణం పోయడం ఆయన ప్రత్యేకత. సంక్రాంతికి వస్తున్నాం వంటి విజయాలతో, అనిల్ రవిపూడి తన హిట్ రికార్డును కొనసాగిస్తూ మరిన్ని అద్భుతాలను సృష్టించబోతున్నారు. ఇకపోతే, ఆయన తదుపరి ప్రాజెక్ట్ మీద కూడా అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. నెక్స్ట్ మెగాస్టార్ చిరంజీవితో సినిమా చేయనున్న విషయం తెలిసిందే. త్వరలోనే ఈ ప్రాజెక్టుపై అఫీషియల్ క్లారిటీ రానుంది.

# నాగచైతన్యచేప పులుసు



టాలీవుడ్ యాక్టర్ అక్కినేని నాగచైతన్య నటిస్తోన్న తాజా చిత్రం తండేల్. రొమాంటిక్ డ్రామా నేపథ్యంలో ప్రాజెక్టుగా వస్తోన్న ఈ చిత్రానికి చందూ మొండేటి దర్శకత్వం వహిస్తున్నాడు. సాయిపల్లవి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. కాగా ఈ సినిమా ఫిబ్రవరి 7న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. తాజాగా నాగచైతన్య షూట్ లొకేషన్‌లో చేపలపులుసు వండిన వీడియోను షేర్ చేశారు మేకర్స్. అన్నా ఇంతకుముందు నాగచైతన్యను కలిసిన కదా.. అప్పుడు మా అంత బాగా ఆయన చేత్తోనే చేపల పులుసు వండుతనని మాటిచ్చినడు. ఆ మాటెంతవరకు కరెక్ట్ అవుతుందో చూడటానికి మేం వెళ్లాం. అచ్చం మాలాగే కట్టెల పొయ్యిపై రుచికరమైన చేపల పులుసు వండాడంటూ ఓ స్థానిక వ్యక్తి సంభాషణలతో సాగుతుంది వీడియో. షూటింగ్ టైంలో చైతూ వండిన చేపల పులుసు తిన్న స్థానికులు సూపర్‌గా ఉందంటూ కితాబిచ్చారు. యేటలో చేపలు పట్టేసాక..మంచి పులుసు ఎట్టేయాలి కదా అంటూ సాగుతున్న మేకింగ్ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. 2018లో గుజరాత్ జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. టాప్ బ్యానర్ గీతాఆర్ట్స్‌పై అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాసు నిర్మిస్తున్నారు. నాగచైతన్య-చందూ మొండేటి కాంబోలో రాబోతున్న మూడో సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి.

# లోకల్ చానల్‌లో గేమ్‌ఛేంజర్ నిందితుడి అరెస్టు



రాంచరణ్ నటించిన గేమ్ ఛేంజర్ విడుదల రోజే పైరసీ విషయంలో చిత్రయూనిట్‌కు బెదిరింపులు వచ్చాయని తెలిసిందే. పలు చోట్ల ఆన్‌లైన్‌లో సినిమా ప్రింట్ షేరింగ్స్ కూడా జరిగాయి. పైరసీ కావడంపై మూవీ టీం సైబర్ క్రైమ్ విభాగాన్ని కూడా ఆశ్రయించింది. విడుదల రోజే పైరసీ రావడంపై గేమ్ ఛేంజర్ టీం సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా గేమ్ ఛేంజర్ ఏకంగా లోకల్ టీవీ ఛానెల్‌లో ప్రసారం కావడం గేమ్ ఛేంజర్ టీంను ఆందోళనకు గురి చేసింది. ఈ సినిమా వచ్చి వారం కూడా కాకుండానే లోకల్ ఛానల్‌లో ప్రసారం అయ్యింది. దీనికి సంబంధించిన స్క్రీన్ షాట్‌లను సోషల్ మీడియాలో షేర్ కూడా చేశారు నెటిజన్లు. ఏపీలోని కాకినాడ ప్రాంతంలో సినిమాను లోకల్ ఛానెల్‌లో ప్రసారం చేసిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో అప్పలరాజు అనే వ్యక్తిని గాజువాకలో అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తోంది. ఈ విషయమై ఇప్పటికే టాలీవుడ్ నిర్మాత శ్రీనివాస కుమార్ (ఎస్‌కేఎన్) ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ఒక సినిమా వెనక కొన్ని వేల మంది శ్రమ దాగి ఉంటుందని తెలిపారు. ఇది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు. ఒక సినిమా విడుదలై 4 నుంచి 5 రోజులు కాకుండానే లోకల్ కేబుల్ ఛానల్‌తో పాటు బస్సుల్లో ప్రసారం చేస్తున్నారు. ఈ విషయం తీవ్ర ఆందోళనకు గురి చేస్తుంది. సినిమా అంటే కేవలం దర్శకుడు, హీరో, నిర్మాతలే కాదు. ఇది నాలుగేండ్ల కృషి. ఇలా ఆన్‌లైన్ పైరసీ చేస్తున్నప్పుడు సినిమా విజయంపై ఆధారపడి జీవిస్తున్న డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్ల గురించి ఆలోచించండి. ఇలా చేయడం వలన చిత్ర పరిశ్రమ భవిష్యత్తుకు కూడా ముప్పు ఉంటుంది.



# మహేష్ సినిమాలో ప్రియాంకా చోప్రా

పాపులర్ అమెరికన్ సింగర్ నిక్ జోనస్‌ను పెళ్లి చేసుకున్న తర్వాత బాలీవుడ్ భామ ప్రియాంకా చోప్రా హాలీవుడ్‌కు పరిమితమైపోయిందని తెలిసిందే. ఈ భామ రీఎంట్రీకి రెడీ అయినట్టు ఇప్పటికే వార్తలు నెట్టింట హల్ చల్ చేస్తున్నాయి. అయితే ఈ బ్యూటీ ఫైనల్‌గా ఎస్ఎస్ఎంబీ 29తో మళ్లీ సిల్వర్ స్క్రీన్‌పై మెరిసేందుకు రెడీ అవుతుందని బీటౌన్ సర్కిల్ టాక్. ఈ నేపథ్యంలో ప్రియాంకా చోప్రా గురువారం సాయంత్రం టొరంటో నుంచి హైదరాబాద్‌లో ల్యాండైంది. దీనిక్కారణం మహేశ్ బాబు చేయబోతున్న కొత్త సినిమానేనట. ప్రియాంకా చోప్రా ఆర్ఆర్ఆర్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి, మహేశ్ బాబు కాంబోలో వస్తోన్న గ్లోబల్ అడ్వెంచరస్ ప్రాజెక్ట్ ఎస్ఎస్ఎంబీ 29 అనౌన్స్‌మెంట్ ఈవెంట్‌లో పాల్గొనేందుకు హైదరాబాద్ వచ్చిందని నెట్టింట కథనాలు రౌండప్ చేస్తున్నాయి. ప్రియాంకా చోప్రా తప్పకుండా ఎస్ఎస్ఎంబీ 29లో భాగం కావాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నానని నెట్టింట ఓ అభిమాని కామెంట్ చేయగా ఆమె ఫైనల్ అయిందని భావిస్తున్నా. అయితే మాత్రం అద్భుతమైనదని చెప్పాలి.. అని మరో అభిమాని కామెంట్ చేశారు. ఇదే నిజమైతే ఐదేళ్ల తర్వాత ప్రియాంకా చోప్రా చేయబోతున్న భారతీయ సినిమా ఎస్ఎస్ఎంబీ 29 కానుంది. మరి దీనిపై కొన్ని గంటల్లో క్లారిటీ వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2002లో తొలిసారి తమిళ సినిమాతో ఇండస్ట్రీ ఎంట్రీ ఇచ్చింది. ఈ బీహారీ సుందరి ఆ తర్వాత తన ఫోకస్ అంతా బాలీవుడ్‌పైనే పెట్టింది. తుఫాన్ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు కూడా హాయ్ చెప్పింది. ఈ సినిమా కోసం మహేశ్‌బాబు ఇప్పటికే మేకోవర్ మార్చుకుని.. లాంగ్ హెయిర్, గడ్డం, పోనీ టెయిల్ లుక్‌లో కనిపిస్తూ సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ చేస్తున్నాడు. ఆఫ్రికన్ అడ్వెంచరస్ ప్రాజెక్ట్‌గా రానున్న ఈ చిత్రాన్ని దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కేఎల్ నారాయణ తెరకెక్కిస్తున్నారు.

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**కడప, జనవరి 17 (రిపబ్లిక్ న్యూస్ ):** స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా. శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మైదుకూరులో, పర్యటించనున్న నేపథ్యంలో. శుక్రవారం జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పర్యటనా ఏర్పాట్లను పరిశీలించారు. మైదుకూరు కోర్టు సముదాయం సమీపంలోని హెలిప్యాడ్, దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమం జరిగే.. ఫంక్షన్ హాలు, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ లో భాగంగా.. స్వచ్ఛ మైదుకూరులో పారిశుధ్యంపై ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలు, నేషనల్ గ్రీన్ కార్ప్స్ తో ర్యాలీ నిర్వహించె నలుగురోడ్ల కూడలి, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ముఖ్యమంత్రి సభ, గ్యాలరీ, స్టాళ్లు ఏర్పటు పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట తెదేపా రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డప్పగారి శ్రీనివాస రెడ్డి, ముఖ్యమంత్రి పర్యటనల కో ఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్ (మాజీ శాసనసభ్యులు), ఏఎస్పీ కె. ప్రకాష్ బాబు, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, బద్వేలు, జమ్మలమడుగు ఆర్డీవోలు చంద్ర మోహన్, సాయిశ్రీ, కేఎంసి కమీషనర్ మనోజ్ రెడ్డి, జిల్లా అధికార యంత్రాంగం తదితరులు పాల్గొన్నారు

# నంద్యాల పారా స్పోర్ట్స్ సంఘం ఆవిర్భావం

**- అధ్యక్షులు: డాక్టర్ రవి కృష్ణ. - ప్రధాన కార్యదర్శి: ఎం.పీ.వి.రమణయ్య లు ఎన్నిక**

నంద్యాల జనవరి 17( రిపబ్లిక్ న్యూస్) :

ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ గుర్తింపు పొందిన ఆంధ్రప్రదేశ్ పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అనుబంధంగా నంద్యాల పారా స్పోర్ట్స్ సంఘం( దివ్యాంగుల క్రీడా సంఘం) ప్రారంభించారు.

అధ్యక్షులుగా డాక్టర్ గుర్రాల రవికృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఎం.పీ.వి. రమణయ్య, ఉపాధ్యక్షులుగా బాబా ఫక్రుద్దీన్ షేక్, సంయుక్త కార్యదర్శిగా మధు కుమార్, కోశాధికారిగా ఆలా మధు, కార్యవర్గ సభ్యులుగా వెంకటరావు, కోనేటి కళ్యాణి, వీరభరతుడు లతో కార్యవర్గం ఏర్పడింది. ఈ సందర్భంగా అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, ప్రధాన కార్యదర్శి ఎం.పి.వి. రమణయ్య మాట్లాడుతూ దివ్యాంగుల క్రీడలను ప్రోత్సహించడానికి, దివ్యాంగ క్రీడాకారులకు సహాయ సహకారాలు అందించడానికి ఈ సంఘం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన నూతన క్రీడా విధానంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలతో దివ్యాంగ క్రీడాకారులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు, దివ్యాంగుల క్రీడాభివృద్ధికి ప్రణాళిక ప్రకటించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలియజేశారు.



నంద్యాల పారా స్పోర్ట్స్ సంఘం అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ



నంద్యాల పారా స్పోర్ట్స్ సంఘం ప్రధాన కార్యదర్శి రమణయ్య

నూతన కార్యవర్గానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు గోనుగుంట్ల కోటేశ్వరరావు అభినందనలు తెలిపారు.

# సంఘమిత్ర సేవా సమితి 31 వార్షికోత్సవాన్ని విజయవంతం చేయండి



**నంద్యాల జనవరి 17 (రిపబ్లిక్ న్యూస్) :** గత 31 సంవత్సరాలుగా నిరంతరం సమాజ శ్రేయస్సు లో మొదటి వరుసలో ఉన్న సంఘమిత్ర అనేక కార్యక్రమాలు సహృదయులైన దాతల సహకారంతో దిగ్విజయంగా నిర్వహిస్తూ వస్తున్నది. 50 మంది విద్యార్థుల వసతి,బోజనము, విద్యా, వైద్యము లే కాక వారి పూర్తి బాధ్యతలను చూస్తున్నది. సంఘమిత్ర సేవాసమితి నంద్యాల 31 వ వార్షికోత్సవం ఈ నెల 19 వ తేది ఆదివారం సాయంత్రం గం.5.30.నిమిషములకు శ్రీ వై.యస్. ఆర్ కళ్యాణమండపం, శ్రీ ప్రథమ నంది దేవస్థాన ప్రాంతము నందు జరుగుచున్నది. ఈ సందర్భంగా గా నిర్వ హించిన సమావేశంలో అధ్యక్షులు కర్నాటి సుబ్బారెడ్డి , సెక్రటరీ చిలుకూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ అందరూ దాతలకు , సహృదయులకూ పేరు పేరునా ఆహ్వానాలను పంపించడం జరుగుతుంది. అయినా పొరపాటున మన ఆహ్వానం ఎవరికైనా చేరనట్లయితే వారు అన్యదా భావించక ఇదే మా ఆహ్వానం గా భావించి తప్పక అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని మా చిన్నారులను ఆశీర్వదించాలని మరి మరి విన్నవించారు. కార్యక్రమం లో సంఘమిత్ర సేవా సమితి కార్యవర్గ సభ్యులు శ్రీనివాస పాండే, వెంకటేశ్వర్లు, సుందర రావు, విజయశ్రీ, వెంకటేశ్వరి, మహేశ్వర రెడ్డి పాల్గొన్నారు. చింతలపల్లి వాసు, మహేశ్వర రెడ్డి లు పాల్గొన్నారు

# ప్రతి మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్.

**-ఈనెల 18న జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్ కార్యక్రమాల నిర్వహణ.**

**-జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**

నంద్యాల,జనవరి 17, (రిపబ్లిక్ న్యూస్): పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఈనెల 18వ తేదీన జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ - దివాస్ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి వెల్లడించారు. ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమాలను అన్ని నివాసిత ప్రాంతాలు, గ్రామా పంచాయితీలు, మున్సిపాలిటీలు, పాఠశాలలు, ఆస్పత్రులు, బస్టాపులు, రైల్వేస్టేషన్లు, పరిశ్రమలు తదితర ప్రభుత్వ, ప్రైవేటు సెక్టార్లలో పరిశుభ్రత కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు అంకితభావంతో భాగ్యస్వాములు కావాలన్నారు. ప్రధానంగా పర్యావరణాన్ని పరిరక్షించడం, పరిశు భ్రమైన వాతావరణాన్ని నెలకొల్పడం, ప్రజారోగ్య పరిరక్షణ, పర్యావరణంపై కాలుష్య ప్రభావాన్ని తగ్గించడం, పర్యాటకులు, యాత్రికులు, పెట్టుబడిదారులను ఆహ్వానించే రీతిలో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడం, ఆర్థిక ప్రయోజనాలను మెరుగుపరచడం, పిల్లలు, భవిష్యత్తు



తరాల వారికి పర్యావరణ పరిశుభ్రతపై అవగాహన కల్పించడం అనే లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఇందులో భాగంగానే ఈనెల 18వ తేదీన పరిసరాల పరిశు భ్రతపై ప్రజలను భాగస్వాములను చేస్తూ నంద్యాల పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుండి భారీ ర్యాలీని ప్రారంభించడంతో పాటు ఆర్టీసీ బస్టాండ్ లో స్వచ్ఛత కార్యక్రమంలో తాను పాల్గొంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. అన్ని మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలలో పరిశుభ్రత కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టి చెత్తాచెదారం తొలగించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమానికి సంబంధించి ప్రతి శాఖకు ఒక నోడల్ అధికారిని నియమించామన్నారు. పరిశుభ్రత నెలకొల్పే అంశాలను పరిగణలోకి తీసుకొని ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు బహుమతులు ప్రధానం చేస్తామని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా సంబంధిత ఉత్తమ అంశాలను డాక్యుమెంటేషన్ చేయడంతో పాటు ప్రభుత్వానికి సిఫార్సు చేస్తూ నివేదికలు పంపుతామన్నారు. అన్ని గ్రామాలలో పెద్ద ఎత్తున పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టి రోడ్లు, చెత్తకుప్పలు, బోరుబావులు, కుంటలు, చెరువులు, కాలువలు లోని వ్యర్థ పదార్థాలను తొలగించడంతోపాటు మెగా శు భ్రత డ్రైవ్ లు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. స్వచ్ఛ ఆంధ్ర %-% స్వచ్ఛ దివస్ కార్యక్రమ అమలుపై ఎంపీడీవోలు, ఆర్డబ్ల్యూఎస్, పంచాయితీ, గ్రామస్థాయి సిబ్బంది అందరూ ప్రత్యేక దృష్టి సారించి విజయవంతం చేయాలని సూచించారు.

# ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ ను పరామర్శించిన జిల్లా ఎస్పీ

**పోలీస్ శాఖ అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు భరోసా**

**మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు**



నంద్యాల క్రైం, జనవరి 17, (రిపబ్లిక్ న్యూస్): జిల్లా పరిధిలోని రుద్రవరం మండలంలోని హరివరం గ్రామ సమీపంలో బుధవారం రాత్రి రెండు మోటార్ సైకిల్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో పోలీసులకు గాయాలయ్యాయి. సదరు రోడ్డు ప్రమాదంలో గాయపడి నంద్యాల ఉదయానంద ఆసుప్రతిలో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ చిన్న బాబును నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా శుక్రవారం ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. కానిస్టేబుల్ ఆరోగ్య పరిస్థితి గురించి అక్కడున్న డాక్టర్లతో అడిగి తెలుసుకొని మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు తెలియజేశారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ ఏ విధమైన ఆందోళన చెందవద్దని జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ మీ కుటుంబానికి అండగా ఉంటుందని, ఏదైనా అవసరం ఉంటే వెంటనే తనను స్వయంగా సంప్రదించవచ్చునని వారికి భరోసా కల్పించారు. చిన్న బాబు త్వరగా కోలుకోవాలని జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు.

# జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన ఆంధ్రప్రదేశ్ పోలీస్ డిపార్ట్మెంట్ ఫెన్సింగ్ టీం సభ్యులు



నంద్యాల క్రైం, జనవరి 17, (రిపబ్లిక్ న్యూస్): ఆల్ ఇండియా పోలీస్ మీట్ 2025 మార్చి 2వ తేదీ నుండి 06వ తేదీ వరకు పంజాబ్ రాష్ట్రంలోని జలంధర్ లో జరగనున్న సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పోలీస్ డిపార్ట్మెంట్ తరపున ఫెన్సింగ్ విభాగానికి సంబంధించి వివిధ జిల్లాల నుండి 12 మంది సభ్యులను ఎంపిక చేయడం జరిగింది. సదరు సభ్యులు నేటి నుండి 40 రోజులపాటు నంద్యాల జిల్లా కేంద్రంలోని పద్మావతి నగర్ నందు గల ఇండోర్ స్టేడియం నందు శిక్షణ తీసుకోవడం జరగనుంది. వీరికి రాష్ట్ర క్రీడ ప్రాధికార సంస్థ కు చెందిన ఫెన్సింగ్ కోచ్ లక్ష్మణ్ శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుంది. ఈ సందర్భంగా వివిధ జిల్లాల నుండి ఫెన్సింగ్ కు శిక్షణ తరగతులకు వచ్చిన పోలీస్ సిబ్బంది నంద్యాల జిల్లా ఎస్పీ ఆధిరాజ్ సింగ్ రాణాని శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయం నందు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా శిక్షణ తరగతులకు వచ్చిన సిబ్బందితో మాట్లాడుతూ ఫెన్సింగ్ విభాగానికి సంబంధించి శిక్షణ తరగతులలో మంచి మెలకువలు నేర్చుకొని జలంధర్ లో జరగనున్న ఫెన్సింగ్ ఛాంపియన్షిప్ నందు మంచి ప్రతిభ కనబరిచి ఆంధ్రప్రదేశ్ పోలీస్ డిపార్ట్మెంట్ కు మంచి పేరు తీసుకుని రావాలని తెలియజేశారు.



# పల్లకిలో విహరించిన మహానందీశ్వర దంపతులు

మహానంది, జనవరి 17, (రిపబ్లిక్ న్యూస్): మహానందీశ్వర దంపతులకు శుక్రవారం రాత్రి పల్లకిసేవ వైభవంగా జరిగింది. ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు రవిశంకర్ అవధాని, అర్చకులు మహానందీశ్వర స్వామి మూర్తులను అలంకరించారు. గణపతి పూజ, అలంకార హారతులు చేసి స్వామి, అమ్మవార్లను పల్లకిలో కొలువు చేశారు. ఆలయ ప్రాకారాల్లో స్వామివార్ల ఉత్సవం కన్నులపండువగా సాగింది. పలు ప్రాంతాల భక్తులు పల్లకిని మోస్తూ భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.



# మహానందిలో రాష్ట్రస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల పందాల పోటీలకు ఏర్పాట్లు






**మహానంది,జనవరి 17, (రిపబ్లిక్ న్యూస్):** మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మహానందిలో రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కేసీ కెనాల్ ప్రాజెక్ట్ చైర్మన్, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త బన్నూరు రామలింగారెడ్డి తెలిపారు. మహానంది మండల పరిధిలోని గ్రామాల టీడీపీ నాయకులతో కలిసి శుక్రవారం మహానందిలో ఎడ్ల బలప్రదర్శన పోటీల ప్రాంగణాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన పార్టీ నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా రామలింగారెడ్డి మాట్లాడుతూ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ప్రతి ఏడాది మహానందిలో అత్యంత వైభవంగా రాష్ట్రస్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు జరుగుతాయన్నారు. మహానందిలో జరిగే ఎడ్ల పందాలకు తెలుగు రాష్ట్రాల నుంచి ఎడ్ల జతలు హాజరవుతాయన్నారు. క్రికెట్ పోటీల్లో ప్రపంచ కప్ ఎలానో మహానందిలో జరిగే ఎడ్ల బల ప్రదర్శన పోటీలు అంతే ప్రాధాన్యత సంతరించుకున్నాయి అని అన్నారు. అందరి సమిష్టి సహకారంతో ఎడ్ల బల ప్రదర్శన పోటీలు విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. అందరూ సహకరించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోటీల ఏర్పాట్లు పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహానంది దేవస్థానం మాజీ చైర్మన్ నాగభూపాల్ రెడ్డి, మాజీ ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జున, తెలుగు గంగ ప్రాజెక్ట్ అధ్యక్షుడు చింతం క్రాంతి కుమార్, టీడీపీ సీనియర్ నాయకులు మౌళీశ్వర్ రెడ్డి, శివ శంకర్, కిలారి వెంకటేశ్వర్లు, జనసేన నాయకుడు రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com